ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 19.0


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5





# అనంతపురం

జిల్లా వార్తలు

బుధవారం 26 నవంబరు 2025




# కట్టబెట్టారు..!

## చెరువు కట్టకు డి.పట్టా ఇచ్చిన రెవెన్యూ అధికారులు



కట్టను తొలగించిన దృశ్యం

- కట్టను తొలగించేందుకు ప్రయత్నించిన డి. పట్టాదారుడు
- నష్టపోతామంటూ స్థానిక రైతుల ఆందోళన
- జిల్లా ఉన్నతాధికారులు, లోకాయుక్తకు ఫిర్యాదు



చెక్‌డ్యాం కట్ట తొలగించక ముందు..

అనంతపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నీల గ్రామంలో తెగిపోయిన చెరువు కట్టకు ఓ వ్యక్తి డి.పట్టా పొంది, దాన్ని చదును చేయడానికి ప్రయత్నించడం వివాదాస్పదం అవుతోంది. నీటి తాకిడికి పురాతన చెరువు కట్ట తెగిపోవడంతో కొన్నేళ్ల కిందట గ్రామ సమీపంలో మరో చోట చెరువు తవ్వించారు. అయితే తెగిపోయిన కట్ట కొంత అలానే ఉండిపోయింది. దీనికి ఓ వ్యక్తి డి.పట్టా పొంది, చదును చేసే ప్రయత్నాలు ప్రారంభించాడు. అయితే కట్ట లేకుండా పోతే అక్కడే నిర్మించిన చెక్‌డ్యాం నిండితే తమ పంట పొలాలు మునిగిపోతాయని దాని కింద భూములు ఉన్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ చదును చేసే పనులను అడ్డుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు చేసిన పొరపాట్ల వల్ల గ్రామంలో రైతుల మధ్య వివాదాలు ఏర్పడుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఇదీ కథ..

అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామ సర్వే నెంబరు 102-2లో 3.19ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. ఈ భూమిలో వంద మీటర్ల మేర రాతి, మట్టి కట్ట ఉంది. స్థానికంగా చెరువు ఉండటంతో ఆ కట్టను ఏర్పాటు చేసినట్లు గ్రామస్థుల చెబుతున్నారు. అయితే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆ కట్టకు 2008లో డి-పట్టా పొందాడు. ఈ క్రమంలోనే ఎకరాకు పైగా భూమి చదును చేసుకున్నాడు. కాగా ఈ కట్టకు ఆనుకుని కాలువ ఉంది. పీఏబీఆర్ నీరు వదిలినప్పుడు గ్రామంలోని చెరువు నుంచి బత్తలపల్లి మండలం ముష్టూరు చెరువుకు నీరు ఈ కాలువ ద్వారానే వెళుతుంది. దీంతో నీటి నిల్వ కోసం ఆ భూమిలోనే పదేళ్ల కిందట చెక్‌డ్యాం నిర్మించారు. చెక్‌డ్యాం నిర్మాణం కోసం స్థానికంగా ఉన్న కొంత మంది రైతులు పది సెంట్లు మొదలుకుని, ఎకరం వరకు పట్టా భూమిని వదులుకున్నట్లు సమాచారం. చెక్ డ్యాం నిండి, నీటి పారకం జరిగితే స్థానికంగా ఉన్న రైతులకు మేలు జరుగుతుందన్న నెపంతో చెక్‌డ్యాం నిర్మాణం చేసినట్లు సమచారం. చెక్ డ్యాం నిర్మాణం తరువాత చుట్టుపక్కల బోరుబావుల్లో నీటి లభ్యత పెరిగినట్లు స్థానిక రైతులు అంటున్నారు.

### ఉన్నతాధికారుల పరిశీలన

స్థానికంగా ఉన్న కట్టను తొలగించి భూమిని చదును చేసేందుకు డి పట్టాదారుడు ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే స్థానికంగా ఉన్న రైతులు అడ్డుకోవడంతో మిన్నకుండిపోయినట్లు ఆయా వర్గాల ద్వారా తెలుస్తోంది. కట్టను తొలగిస్తే చెక్‌డ్యాం నిండిన సందర్భాల్లో నీరంతా తమ పొలాల్లోకి చేరుతుందని, కట్టకు దిగువవైపు ఉన్న ఓ రైతు కొన్ని నెలల కిందట లోకాయుక్తను ఆశ్రయించాడు. దీంతో నెల రోజుల కిందట జేసీ, ఆర్డీఓ, తహసీల్దార్ స్థానిక పరిస్థితిని పరిశీలించారు. ఈక్రమంలోనే ఆ డి. పట్టాదారుడు 1.6ఎకరాల్లో సాగులో ఉన్నట్లు తేల్చారు.

మిగిలిన 1.59ఎకరాల భూమిలో చెక్‌డ్యాం, కుంట ఉన్నట్లు నివేదించారు. ఆమేరకు చెక్‌డ్యాం రైతులకు అవసరం అవుతుందని నిర్ణయించి ఆమేరకు పట్టాదారుడు సాగులో ఉన్న భూమి మినహా మిగిలిన భూమికి ఇచ్చిన డి. పట్టాను రద్దు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు గ్రామ రెవెన్యూ అధికారి పట్టా రద్దుకు మే నెలలోనే తహసీల్దార్‌కు నివేదించారు. తహసీల్దార్ కూడా ఉన్నతాధికారులకు నివేదించినట్లు సమాచారం.



ఎక్స్‌కవేటర్ వెళ్లేందుకు కాలువను పూడ్చిన దృశ్యం



కట్టకు ఆనుకుని ఉన్న చెక్‌డ్యాం

### జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు..

రెవెన్యూ అధికారులు ఒక వైపు డి. పట్టా రద్దుకు చర్యలు చేపట్టారు. ఇంతలోనే డి.పట్టా పొందిన వ్యక్తి కట్టను చదును చేసే ప్రక్రియను మొదలు పెట్టారు. మూడు రోజుల కిందట జేసీబీతో కొంత మేర కట్టను తొలగించాడు. స్థానిక రైతులు పనులు అడ్డుకుని, విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం ఇచ్చారు. ఈ సర్వే నంబరుల్లోనే కాకుండా గ్రామంలోని మరి కొన్ని సర్వే నంబర్లలో కూడా చెక్‌డ్యాంలు, కాలవలను ఆక్రమించుకున్నట్లు సమాచారం. గ్రామ సర్వే నంబరు 26లోనూ చెక్‌డ్యాంను తొలగించినట్లు తెలిసింది. అలాగే 221 నుంచి 225 సర్వే నంబర్లలోని కుమ్మర కాలువ ఆక్రమణలకు గురైంది. సర్వే నంబరులో 254లో మరో చెక్‌డ్యాంను తొలగించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

### పట్టా రద్దుకు సిఫారసు

గత కొన్ని రోజులుగా మన్నీల గ్రామ సర్వే నంబరు 102-2లో భూ వివాదం నడుస్తోంది. స్థానికంగా ఉన్న ఓ రైతు లోకాయుక్తను ఆశ్రయించడంతో జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ క్షేత్రస్థాయిలో స్థానిక పరిస్థితిని పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డి-పట్టా రద్దుకు నివేదించాం.

-మోహన్‌కుమార్, తహసీల్దార్

### ప్రయోజనం లేదు

గ్రామంలో నీటి వనరులకు ఉపయోగపడే చెక్ డ్యాంలు, కాలువలు, కుంటలు ఆక్రమణలు, ఇతరత్ర సమస్యలపై సంబంధిత అధికారుల దృషికి చాలా సార్లు తీసుకెళ్లాం. అయినా ప్రయోజనం లేదు. అధికారులు సమస్య వచ్చిన వెంటనే స్పందిస్తే ప్రయోజనం ఉంటుంది. సకాలంలో స్పందించకపోవడం వల్ల వివాదాలు అలానే ఉండి పోతున్నాయి.

- త్రిలోక్‌నాయుడు, సర్పంచు

# సీఎం దృష్టికి అర్బన్ సమస్యలు

- ముఖ్యమంత్రికి వివరించిన ఎమ్మెల్యే దగ్గుపాటి



ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం, నవంబరు25(ఆంధ్రజ్యోతి): అనంతపురం అర్బన్ అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మంగళవారం తెలిపారు. ఆయన విజయవాడలో సీఎం క్యాంప్ ఆఫీస్‌లో ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులను సీఎంకు వివరించారు. నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, నడిమివంక, మరువ వంక ప్రహరీ నిర్మాణం అంశాలను సీఎంకు వివరించారు. వీటికి ఇప్పటికే డీపీఆర్‌లు సిద్ధం చేశారని, నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. సీఎం సానుకూలంగా స్పందించారు. తర్వాత నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలు, కొత్త క్లస్టర్ల, కమిటీల ఏర్పాటు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ఎమ్మెల్యే దగ్గుపాటి సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మంత్రి నిమ్మలను కలిసి వంకల ప్రహరీల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కోరారు. నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలపై మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు తెలియజేశారు. ప్రభుత్వాసుపతిలో 560 పడకలకు మాత్రమే బడ్జెట్ విడుదల అవుతోందని, పడకల సంఖ్యను, నిధులను పెంచాలని డీఎంఈ రఘునందన్‌ను కలసి కోరారు.

## వెళ్లొస్తాం స్వామీ..!

- సత్యసాయి భక్తుల తిరుగు పయనం
- పుట్టపర్తి బస్టాండు, రైల్వే స్టేషన్‌లో రద్దీ

6



## విద్యా ప్రమాణాల పెంపు దిశగా..

- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక అమలు
- 1 నుంచి 5 తరగతులకు ఎఫ్ఎల్ఎన్ పేరుతో పరీక్ష
- డైట్ విద్యార్థుల సహకారంతో యాప్ ద్వారా టెస్ట్

7

# ప్రేమించాడని చంపేశారు !

- హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారు
- రీ పోస్టుమార్టం చేయించండి
- పోలీసులకు మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు



మృతుడి తల్లిదండ్రులు వెంకటేశులు, వరలక్ష్మి కుటుంబ సభ్యులు, ఆనంద్(ఫైల్)

కళ్యాణదుర్గం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): 'ప్రేమించిన పాపానికి మా కుమారుడిని హత్య చేశారు. తర్వాత దాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించారు' అని మృతుడి తల్లిదండ్రులు వెంకటేశులు, వరలక్ష్మి మంగళవారం టౌన్ సీఐ హరినాథ్‌కు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన మేరకు...బ్రహ్మసముద్రం మండలం యానకల్లు గ్రామానికి చెందిన ఆనంద్ (21) బెంగళూరులో ఉద్యోగం చేసేవాడు. అయితే ఉద్యోగం రాలేదని ఈ నెల 21న కళ్యాణదుర్గం పట్టణ శివారు ప్రాంతంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ క్రమంలోనే పోస్టుమార్టం కూడా ముగించేశారు. ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడోనని, వివరాలు ఆరా తీసి, అక్కడి ఆనవాళ్లు గమనిస్తే హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించారని సందేహం కలిగిందని వారు వాపోయారు. తమ కుమారుడు ఒక అమ్మాయిని ప్రేమించాడని, ఆమె బంధువులే ఈ హత్యకు పాల్పడ్డారని ఆరోపించారు. బెంగళూరులో ఉద్యోగం చేసుకుంటున్న తమ కుమారుడిని పథకం ప్రకారం కళ్యాణదుర్గం రప్పించి హత్య చేసినట్లు ఆరోపించారు. తమ కుమారుడి మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, రీ పోస్టుమార్టం చేపట్టాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# బాలికలు ప్రగతి సాధించాలి

- జిల్లా సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రాజశేఖర్

అనంతపురం రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని విషయాల్లో ప్రగతి సాధించాలని జిల్లా సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రాజశేఖర్ అన్నారు. మండలంలోని కురుగుంట కేజీబీవీలో మంగళవారం ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి అధ్యక్షతన బేటీ బచావ్‌బేటీ పడావ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయాధికారి రాజశేఖర్, లోక్ అదాలత్ అధ్యక్షుడు శ్రీనివాసరావు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు సామాజిక రుగ్మతలని పేర్కొన్నారు. బాలికలు ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకొని బాగా చదువుకోవాలన్నారు. తద్వారా మంచి ప్రయోజకులు అవ్వాలన్నారు. బాలలపై జరిగే హింస, దోపిడీని వ్యతిరేకించాలన్నారు. బాలల రక్షణ చట్టాలు పూర్తిగా అవగాహన చేసుకుని సురక్షితంగా ఉండాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మిషన్ కోఆర్డినేటర్ శ్రీదేవి, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా సమన్వయకర్త కృష్ణమాచారి, మహిళ పోలీస్‌స్టేషన్ సీఐ వెంకటేశ్వర్లు, కేజీబీవీ ఎస్ఓ నర్మదా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు సాధించిన విద్యార్థులతో ముఖ్య అతిథులు



నిర్మాణం పూర్తయిన రాప్తాడు అన్న క్యాంటీన్

# పల్లెలకూ అన్న క్యాంటీన్లు..

పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లు మరిన్ని ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు నగరాలు, పెద్ద పట్టణాలకే పరిమితమైన అన్న క్యాంటీన్లను మండల, నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఏర్పాటు చేస్తోంది. రూరల్ అన్న క్యాంటీన్ల పేరుతో ఏర్పాటు చేస్తోంది. ఉమ్మడి జిల్లాకు నాలుగు మంజూరయ్యాయి. శరవేగంగా వాటి నిర్మాణ పనులు సాగుతున్నాయి. రాప్తాడులో దాదాపు పూర్తయి, నిర్మాణానికి సిద్ధంగా ఉంది.


అనంతపురం క్రైం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్ల ద్వారా ప్రభుత్వం నామమాత్రపు ధరకే టిఫిన్లు, భోజనం అందిస్తోంది. 2019 ముందే అన్న క్యాంటీన్లు పెట్టి కోట్లాదిమంది పేద ప్రజలకు టీడీపీ ప్రభుత్వం కడుపు నింపింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదు. అన్న క్యాంటీన్లను నిర్వీర్యం చేయాలని చూసింది. ఐదేళ్లు పట్టెడు అన్నం కూడా పెట్టలేదు. కరోనా (మిగతా 6వ పేజీలో...)

- పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు
- రూరల్ అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు నిర్ణయం
- ఉమ్మడి జిల్లాకి 4 మంజూరు
- శరవేగంగా పనులు
- రాప్తాడులో ప్రారంభానికి సిద్ధం

# కొట్టుకుపోయిన పిల్లర్ రాళ్లు

- బ్రిడ్జిపై రాకపోకలు బంద్






బ్రిడ్జిపై రాకపోకలను బంద్ చేయిస్తున్న హెచ్చెల్సీ అధికారులు, అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ పిల్లర్ రాళ్లు ఊడిన దృశ్యం

కణేకల్లు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీచిక్కణ్ణేశ్వర వడయార్ అవుట్‌ఫాల్ రెగ్యులేటర్‌కు ఉన్న పిల్లర్‌రాళ్లు నీటి ప్రవాహానికి మంగళవారం కొట్టుకుపోయాయి. దీంతో పిల్లర్‌పై ఉన్న రోడ్డుపై రాకపోకలను హెచ్చెల్సీ అధికారులు నిలిపివేయించారు. తుంగభద్ర నుంచి వచ్చే హెచ్చెల్సీ నీరు కణేకల్లు చెరువుకు చేరుకుని ఆ తరువాత అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ ద్వారా పీఏబీఆర్ డ్యాంతో పాటు దిగువన ఉన్న ఇతర ప్రాంతాలకు వెళుతుంది. నాలుగేళ్ల కిందట అవుట్‌ఫాల్ రెగ్యులేటర్‌కు అనుబంధంగా ఉన్న కల్వర్టు కూలిపోయింది. దీంతో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నాయకులు తమ సొంత నిధులతో వాహన రాకపోకలకు అనుకూలంగా కల్వర్టు స్థానంలో బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. కాగా మంగళవారం దాని పక్కనే ఉన్న మరో పురాతన కల్వర్టుపై భారీ వాహనాలు ప్రయాణించడంతో కిందనున్న పిల్లర్ రాళ్లు ఒక్కొక్కటిగా ఊడిపోయి కొట్టుకుపోవడంతో అవుట్‌ఫాల్ రెగ్యులేటర్‌కు ప్రమాదం వచ్చే పరిస్థితి ఏర్పడింది. దీంతో హుటాహుటిన హెచ్చెల్సీ డీఈ దివాకర్‌రెడ్డి, జేఈ నరేంద్రమారుతీ తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని కల్వర్టుపై వాహనాల రాకపోకలను పూర్తిగా బంద్ చేయించారు.

# వీఆర్‌కు అనంత రూరల్ డీఎస్పీ



వెంకటేశ్వర్లు

అనంతపురం క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లును వీఆర్‌కు పంపుతూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉన్నఫలంగా డీఎస్పీని వీఆర్‌కు పంపడం జిల్లా పోలీస్ శాఖలో చర్చనీయాంశమైంది. ఆయన అనంతపురం రూరల్ డీఎస్పీగా సుమారు 13 మాసాలు పనిచేశారు. 2024 సెప్టెంబరు మూడో వారంలో ఆయన జిల్లాకు వచ్చారు. రెండు నెలల కిందట ఆయన బదిలీ అవుతారనే ప్రచారం జరిగింది. కానీ ఉన్నఫలంగా డీఎస్పీని బదిలీ చేయడం వెనుక ఉన్న కారణాలపై పోలీసుల్లో చర్చ నడుస్తోంది. బలమైన కారణాల వల్లే ఆయనను ఉన్నఫలంగా బదిలీ చేసినట్టు సమాచారం. కొందరు అధికార పార్టీ నేతలు చెప్పినట్లు వినకపోవడమా లేక ఇతర ఆరోపణల వల్ల పంపించారా అనే చర్చ నడుస్తోంది. శింగనమల, రాప్తాడు నియోజకవర్గాల్లో కొందరు నాయకులు చెప్పినట్లు వ్యవహరిస్తున్నారని, మరికొందరు నేతలు సిఫార్సులను పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఆయనపై వినిపిస్తున్నాయి.

## వాస్తవాలు వెలుగు చూస్తాయా..?

6

- కొందరు కార్యదర్శులు.. వైసీపీ సర్పంచ్‌ల కుమ్మక్కు
- మేజర్ పంచాయతీల్లో అక్రమాలపై విచారణకు ప్రభుత్వం ఆదేశం

కంది రైతు

# గుండె జల్లు..!

## చిరుజల్లులతో పంటపై ప్రభావం

- రాలిపోతున్న పూత, పిందె
- వరుసగా పంటను దెబ్బతీస్తున్న తుఫాన్లు




ధర్మవరం మండలంలో పూత, పిందె దశలో ఉన్న కందిపంట

ధర్మవరం రూరల్/రొద్దం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడా వర్షం కురుస్తోంది. కందిపంటపై తుఫాన్ తీవ్ర ప్రభావం చూపుతోంది. రెండువారాల క్రితం తుఫాన్ల ప్రభావంతో పూత, పిందె చాలా వరకు రాలిపోయింది. దీంతో రైతులు రసాయనిక మందులు పిచికారి చేయడంతో మళ్లీ పూతపిందె దశకు చేరుకుంది. మళ్లీ అల్పపీడనం ప్రభావంతో ప్రస్తుతం చిరుజల్లులు పడుతుండడంతో కందిరైతుల గుండెల్లో గుబులురేపుతోంది.



శుక్రవారం రాత్రి నుంచి మేఘాలు కమ్ముకుని అక్కడడక్కడ వర్షం పడుతుండటంతో ఉన్న పంట కూడా చేతికందకుండా పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌లో ధర్మవరం మండలంలో ఏడు వేల ఎకరాల్లో కంది సాగుచేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. ముందస్తుగా సాగుచేసిన కందిపంటకు కాయలు ఏర్పడ్డాయని, వర్షం కురిస్తే పంటంతా పోయి తీవ్ర నష్టం వస్తుందని రైతులు (మిగతా 6వ పేజీలో...)

# పాపం.. పసివాడు..!



కరెంటు స్తంభంపై వేలాడుతున్న దృశ్యం, బిల్లే వరుణ్(ఫైల్)

చదువుకుంటున్న పిల్లోడు..! ఖాళీ సమయంలో కూలి పనులు చేస్తూ తల్లిదండ్రులకు ఆసరగా ఉండేవాడు. బడి నుంచి ఇంటికి వచ్చాక.. స్నేహితుడి తోటలో మోటారు ఆడటం లేదని తెలిసి సరిచేసేందుకు వెళ్లాడు. వయసుకు మించి, ప్రమాదకరమైన కరెంటు పనికి పూనుకుని ప్రాణాలను కోల్పోయాడు. తల్లిదండ్రులను శోకసంద్రంలో ముంచేసి వెళ్లిపోయాడు. పోలీసులు తెలిపిన మేరకు, కనగానపల్లికి చెందిన బిల్లే నాగభూషణం, సరోజమ్మ దంపతుల కుమారుడు వరుణ్ (16) స్థానిక జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బడి నుంచి మంగళవారం సాయంత్రం ఇంటికి వచ్చాక వరుణ్ స్నేహితుడు వంశీ వచ్చి కలిశాడు. తమ తోటలో మోటారు ఆడటం లేదని, వచ్చి చూడాలని తీసుకువెళ్లాడు. తోటలో మోటాకు అమర్చిన విద్యుత్ వైరును పరిశీలించేందుకు స్తంభాన్ని ఎక్కాడు. అంతే..! విద్యుదాఘాతంతో విలవిలలాడుతూ ప్రాణాలను కోల్పోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడికి చేరుకున్నారు. స్థంభంపై తల్లకిందులుగా వేలాడున్న వరుణ్‌ను చూసి బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

-ఆంధ్రజ్యోతి, కనగానపల్లి

## పైసలిస్తేనే మ్యుటేషన్..!

- తహసీల్దార్ కార్యాలయాల్లో హెచ్చుమీరిన అవినీతి
- ఒక్కో ఫైల్‌కు రూ.10వేల నుంచి రూ.50వేలు
- పర్యవేక్షించని రెవెన్యూ ఉన్నత యంత్రాంగం

6

# వెళ్లొస్తాం స్వామీ..!

- సత్యసాయి భక్తుల తిరుగు పయనం
- పుట్టపర్తి బస్టాండు, రైల్వే స్టేషన్‌లో రద్దీ



రైల్వే స్టేషన్‌లో భక్తులు

సత్యసాయి శతజయంతి వేడుకలకు వచ్చిన భక్తులు తమ స్వస్థలాలకు తిరిగి వెళుతున్నారు. దీంతో పుట్టపర్తి బస్టాండు, సత్యసాయి రైల్వే స్టేషన్ కిటకిటలాడుతున్నాయి. దేశవిదేశాల నుంచి వచ్చిన లక్షలాది మంది భక్తులు దాదాపు రెండు వారాలపాటు వేడుకలలో పాల్గొన్నారు. మహా సమాధిని దర్శించుకున్నారు. పుట్టపర్తి పట్టణంలో సందడి చేశారు. ప్రశాంతి నిలయంలో జరిగిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను కన్నులారా వీక్షించి తన్మయత్వం చెందారు. వేడుకలు ముగియడంతో అందరూ ఖాళీచేసి, బస్సులు, రైళ్లు, ప్రైవేటు వాహనాలలో వెళ్లిపోతున్నారు.



## మునుపటి కళ

సత్యసాయి బాబా 2011, ఏప్రిల్ 24న శివైక్యం చెందారు. ఆయనను కడసారి చూసుకునేందుకు లక్షల మంది తరలివచ్చారు. ఆ తరువాత జయంతి వేడుకలు, ఆరాధనోత్సవాలకు భక్తులు వస్తున్నారు. శత జయంతి వేడుకలకు వచ్చినంతగా రాలేదు. సుమారు 14 సంవత్సరాల తరువాత మునుపటి కళ కనిపించిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రులు, గవర్నర్‌లు, హైకోర్టు న్యాయమూర్తులు, క్రీడాకారులు, సినీతారలు.. ఇలా అందరూ వేడుకలకు తరలివచ్చారు. సత్యసాయి జయంతిని ప్రభుత్వ పండుగగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం, ట్రస్ట్‌తో కలిసి వేడుకలను ఘనంగా నిర్వహించడంతో పుట్టపర్తికి మళ్లీ మంచి రోజులు వచ్చాయన్న ఆనందం అందరిలో కనిపిస్తోంది.

-ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

# రైతులు ఒకేసారి ఒకే రకం పంట వేయవద్దు

**దీనిపై అధికారులు అవగాహన కల్పించాలి**

**రైతన్నా-మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత**



మామిళ్లపల్లిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

కనగానపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులంతా ఒకేసారి ఒకే రకం పంట సాగుచేస్తే గిట్టుబాటు ధరలేక నష్టాలు వస్తున్నాయనీ, ఈ పద్ధతిని విడనాడాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతన్నా-మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మామిళ్లపల్లిలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. రైతన్నల ఇళ్ల వద్దకే వెళ్లి 'అన్నదాత సుఖీభవ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా' అని ఆరాతీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పంపిన కరపత్రాన్ని అందజేశారు. అనంతరం వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలతో కలిసి రైతులతో సమావేశమై పంటల సాగుపై చర్చించారు. రైతులంతా ఒకేరకం పంట, ఒకే సీజన్‌లో సాగుచేయడం ద్వారా దిగుబడులు అధికమై ధరలు తగ్గి నష్టపోతారన్నారు. వేర్వేరు పంటలు పెట్టుకోవాలన్నారు. ఎప్పుడు, ఏ పంటలు సాగుచేయాలి, తెగుళ్ల నివారణకు ఎటువంటి మందులు పిచికారీ చేయాలన్న అంశాలపై రైతులకు అధికారులు సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ కిష్టయ్య, ఏఓ మాధురి, డీసీఎంఎస్, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్లు నెట్టెం వెంకటేష్, బోయపాటి సుధాకర్ చౌదరి, కన్వీనర్ పోతులయ్య, మాజీ ఎంపీపీ ముకుందనాయుడు నాయకులు పాల్గొన్నారు.

## చీనీ టన్ను రూ.19 వేలు



అనంతపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయని వివరించారు. మార్కెట్‌కు మొత్తంగా 18 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

# వాస్తవాలు వెలుగు చూస్తాయా..!

- కొందరు కార్యదర్శులు.. వైసీపీ సర్పంచ్‌ల కుమ్మక్కు
- మేజర్ పంచాయతీల్లో అక్రమాలపై విచారణకు ప్రభుత్వం ఆదేశం

అనంతపురం న్యూటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని మేజర్ పంచాయతీల్లో అక్రమాలు వెలుగులోకి వచ్చేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలోని పలు మేజర్ పంచాయతీల్లో కోట్లలో అక్రమాలకు పాల్పడినట్లు.. పలు ప్రాంతాల్లో ఆడిట్‌లో వెలుగులోకి వచ్చాయి. గత ప్రభుత్వంలో పంచాయతీ కార్యదర్శులతో కుమ్మక్కై వైసీపీ సర్పంచులు దోపిడీ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ వెంకటకృష్ణ ఈనెల 15న మెమో జారీచేశారు. జిల్లా పంచాయతీ అధికారులు మేజర్ పంచాయతీల్లో విచారణ చేసి అక్రమాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే పలు జిల్లాల్లో డీపీఓలు మేజర్ పంచాయతీల్లో అక్రమాలు వెలికితీసే పనిలో ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో మాత్రం పంచాయతీ అధికారులు తమకు ఏమీ పట్టనట్లు ఉన్నారన్న చర్చ జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో 49 మేజర్ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 6 నగర పంచాయతీలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. మిగిలిన వాటిలో 43 మేజర్ గ్రేడ్-1 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా జిల్లా కేంద్ర సమీపంలో ఉన్న పంచాయతీలతో పాటు మండల కేంద్రాల్లో ఉన్న పంచాయతీల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయన్న విమర్శలున్నాయి. ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా నియామకం కావడానికి కూడా పెద్ద ఎత్తున ముడుపులు ముట్టచెప్పాల్సి వస్తోందన్న చర్చ జరుగుతోంది. సీటులో కూర్చున్న తరువాత అక్రమాలకు తెరలేపి.. భవన నిర్మాణ అనుమతుల మంజూరులోను, నూతన భవనాలకు పన్నుల విధింపుల్లోనూ అందినకాడికి దోచేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల పాటు జరిగిన అక్రమాలు వెలికి తీసే పనిలో కూటమి ప్రభుత్వం పడింది. పంచాయతీల్లో అక్రమాలపై విచారణ చేసేలా ఓఎస్‌డీ నుంచి మెమో జారీ కావడంతో అక్రమార్కుల్లో దడ మొదలైందన్న చర్చ జరుగుతోంది. స్థానికంగా ఉన్న డీపీఓలు నిక్కచ్చిగా విచారణ చేసి అక్రమాల్లో భాగస్వామ్యులైన వారిపై చర్యలు చేపడతారా..? గాలికి వదిలేస్తారా అన్నది తెలియాలంటే వేచి చూడాల్సిందే.

# పైసలిస్తేనే మ్యుటేషన్..!



**తహసీల్దార్ కార్యాలయాల్లో హెచ్చుమీరిన అవినీతి**

**ఒక్కో ఫైల్‌కు రూ.10వేల నుంచి రూ.50వేలు**

**పర్యవేక్షించని రెవెన్యూ ఉన్నత యంత్రాంగం**

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో అవినీతి హెచ్చుమీరింది. ముడుపులిస్తేనే మ్యుటేషన్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ రికార్డులలో ఆస్తి యజమాని మార్పు విషయంలో మ్యుటేషన్ కీలకం. తండ్రి లేదా తల్లి పేరుతో ఉన్న ఆస్తి వారు మరణిస్తే వారి కుమారుల పేరుతో ఆన్‌లైన్ రికార్డుల్లో ఎక్కించడానికి మ్యుటేషన్ కీలకమవుతుంది. రెవెన్యూ శాఖలో అమ్మకం, వారసత్వం లేదా బహుమతి వంటి లావాదేవీల అనంతరం ఆస్తి రికార్డులలో యజమాని పేరును మార్చడాన్ని మ్యుటేషన్ అంటారు. ప్రస్తుతం ఈ మ్యుటేషన్ రెవెన్యూ అధికారులకు మంచి ఆదాయ మార్గంగా మారింది. అవసరం కొద్దీ రైతులు, ఇతర వర్గాలు ముడుపులు ఇచ్చి తమ పని చేయించుకుంటున్నారు. రెవెన్యూ శాఖలో ఉన్నతాధికారులు పర్యవేక్షించకపోవడం వల్లనే ఈ అవినీతి తారస్థాయికి చేరిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### రూ.10వేల నుంచి రూ.50వేల దాకా..

మ్యుటేషన్ విషయంలో డబ్బు అందితేనే పని పూర్తవుతోంది. గుట్టుచప్పుడు కాకుండా బేరాలు మాట్లాడేసుకుని ఆ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. మ్యుటేషన్ చేయాలంటే కనీసం రూ.10వేలతో బేరాలు సాగుతున్నాయని తెలిసింది. తక్కువ సెంట్లలో ఉన్న భూమికి అందులోనూ ధరలు లేని భూములకైతేనే ఆ రేటు. ఎకరాలలో మ్యుటేషన్ చేయాలంటే మాత్రం రూ.30వేల పైమాటే చెల్లుబాటవుతోంది. ఇక పట్టణాలు, మండల కేంద్రాల పరిధిలోని అధిక ధరలున్న భూములకు రూ.50వేలకు తక్కువ తీసుకోవడం లేదని సమాచారం.

### వీఆర్వోల నుంచి తహసీల్దార్ల వరకు...

వాస్తవానికి ప్రస్తుతం ఆటో మ్యుటేషన్ విధానం అమల్లోకి వచ్చింది. ఒకరి పేరు మీదున్న ఆస్తి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవగానే మరొకరి పేరు మీద రిజిస్ట్రేషన్ అవుతుంది. దీంతో పాటు కొనుగోలు చేసిన వ్యక్తి పేరు ఆన్‌లైన్‌లో రికార్డుల్లో ఆస్తి యజమానిగా నమోదవుతుంది. అయితే గతంలో జరిగిన రిజిస్ట్రేషన్ల విషయంలో పేర్లను మ్యుటేషన్ ద్వారా ఎక్కిస్తున్నారు. వారసత్వం ఆస్తికి సంబంధించి కుటుంబ పెద్దలు మృతి చెందిన సందర్భాల్లో వారి పిల్లల పేర్లు ఆన్‌లైన్‌లో మ్యుటేషన్ ద్వారానే నమోదు చేయిస్తున్నారు. ఇదంతా క్షేత్రస్థాయిలో వీఆర్వోల నుంచి తహసీల్దార్ల వరకు వ్యవహారం నడుస్తోంది. కొన్ని సందర్భాల్లో వీఆర్ఓల స్థాయిలోనే బేరాలు మాట్లాడేసుకుంటున్నారు. మరికొంత మంది నేరుగా తహసీల్దార్లతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాల్లో మ్యుటేషన్ వ్యవహారం బాగానే నడుస్తోంది. ముడుపులు ముట్టాకే పనులు జరుగుతున్నాయి. జిల్లాలో తహసీల్దార్‌లు లేని కార్యాలయాల్లో



కొందరు డిప్యూటీ తహసీల్దార్లే ఇన్‌చార్జ్‌లుగా ఉండగా, కొన్ని చోట్ల రెండు మండలాల్లో తహసీల్దార్లే చూస్తున్నారు. కీలకమైన ఫైల్స్, పైసలందే వాటి విషయంలో తహసీల్దార్లే ముందుంటున్నట్లు సమాచారం.

### డబ్బు వసూళ్లను ఉపేక్షించం

మ్యుటేషన్ విషయంలో డబ్బు వసూలు చేయడాన్ని ఉపేక్షించేదిలేదు. ఇలాంటి విషయాలపై కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారు. ప్రభుత్వం నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా మ్యుటేషన్, ఇతర విషయాల్లో లంచం అడిగారా..?అని నేరుగా ప్రజల అభిప్రాయం తీసుకుంటున్నారు. మ్యుటేషన్‌కు సంబంధించి అవినీతికి పాల్పడకూడదు. తహసీల్దార్ కార్యాలయాల్లో డబ్బు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం.

-మలోల, డీఆర్ఓ

### ఆటోమ్యుటేషన్‌లో అవాంతరాలు

భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవగానే జరగాల్సిన ఆటో మ్యుటేషన్‌లోనూ అవాంతరాలు ఎదురవుతున్నాయి. ముగ్గురు లేదా నలుగురు వ్యక్తులు ఐదు నుంచి పదెకరాల భూమిని తమ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న సమయంలో సాంకేతిక లోపాలు తలెత్తుతున్నాయి. తాజాగా అనంతపురం సమీపంలోని ఓ గ్రామ పరిధిలో 1.5ఎకరాలను ముగ్గురు వ్యక్తులు తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ముగ్గురి పేరుతోనూ రిజిస్ట్రేషన్ అయినట్లు వచ్చింది. అయితే ఇక్కడ ఒక్కొక్కరి పేరుతో 1.5ఎకరాలున్నట్లు డాక్యుమెంట్‌లో చూపడం గందరగోళానికి దారి తీస్తోంది. దీంతో ఆ భూమిని వ్యవసాయేతర భూములు(కమర్షియల్)గా కన్వర్షన్ చేసుకునే విషయంలో రెవెన్యూ శాఖకు చార్జీలు చెల్లించే విషయంలోనూ సాంకేతిక పరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇది వరకు డాక్యుమెంట్ తెలుగులోనే వచ్చేది.. ఆటో మ్యుటేషన్‌లో తెలుగు, ఇంగ్లిష్ రెండింట్లోనూ వస్తున్నాయి. వీటిలో ఉన్నత స్థాయిలో మార్పులు జరిగితే గందరగోళానికి తెరతీసినవారవుతారు. లేకపోతే మరింత ఆందోళన వ్యక్తమయ్యే అవకాశం ఉంది.

# పరుగుల దీక్ష

- జాతీయస్థాయి పోటీలకు మడకశిర విద్యార్థిని



మడకశిర టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గ్రామమైన గంగులవాయిపాళ్యానికి చెందిన దీక్ష పరుగు పోటీల్లో సత్తాచాటింది. ఏకంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. రాజు, రత్నమ్మ దంపతుల పెద్దకుమార్తె దీక్ష మడకశిర కేజీబీవీలో 9వ తరగతి చదువుతోంది. గుంటూరు జిల్లా వినుకొండలో సోమవారం నిర్వహించిన స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి 800 మీటర్ల అండర్-17 పరుగు పందెంలో మూడోస్థానంలో నిలిచింది. తద్వారా జాతీయ పోటీలకు ఎంపికైందని పీఈటీ అనిత తెలిపారు. లక్నో వేదికగా త్వరలో నిర్వహించే పోటీల్లో దీక్ష పోటీపడనుంది.

### నిరుపేద కుటుంబం

దీక్షది నిరుపేద కుటుంబం. ఎకరా పొలం మాత్రమే ఉంది. తండ్రి రాజు కూలి పనులకు వెళ్తుంటాడు. దీక్ష చెల్లి కూడా మడకశిర కేజీబీవీలోనే ఎనిమిదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు, టీచర్ల ప్రోత్సాహంతోనే రాష్ట్రస్థాయి పరుగు పోటీల్లో రాణించానని దీక్ష తెలిపింది. జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం పట్ల సంతోషం వ్యక్తం చేసింది.

## టమోటా కిలో రూ.49



అనంతపురం రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.49తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌కు 2025 టన్నుల టమోటా కాయలు వచ్చాయని వివరించారు. టమోటా కిలో కనిష్ఠ ధర రూ.27, సరాసరి ధర రూ.37తో విక్రయాలు జరిగాయని వెల్లడించారు.

# కంది రైతు గుండె జల్లు..!

(5వ పేజీ తరువాయి)

చెందుతున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో తుపాన్ల ప్రభావంతో దిగుబడులు చేతికందకుండా పోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. రొద్దం మండలంలో 20వేల ఎకరాల్లో కందిపంట సాగుచేశారు. గత యేడాది కందిపంట దిగుబడి బాగా వచ్చి రైతులు మంచి ఆదాయం పొందారు. దీంతో ఈసారి ఎక్కువ మంది కంది పంట సాగుచేశారు. జూన్ మాసంలో కందిపంట సాగుచేయగా రెండు నెలలపాటు వర్షాలు కురవలేదు. దీంతో పంట పూర్తిగా దెబ్బతిన్నట్లేనని అనుకుంటున్న సందర్భంలో రెండుమార్లు బలమైన వర్షం కురిసింది. చీడపీడలు ఆశించడంతో మందును పిచికారి చేశారు. ఆర్. మరువపల్లికి చెందిన తిమ్మారెడ్డి అనే రైతు సాగుచేసిన 15ఎకరాల కందిపంట పూర్తిగా దెబ్బతిందని వాపోయాడు.

### మందులు కొట్టి కాపాడుకున్నా..



నాలుగు ఎకరాల్లో కంది పంటను సాగుచేశాను. పంటకు ఒకపక్క తెగుళ్లు, మరోపక్క వర్షాల బెడదతో ఆందోళనగా ఉంది. నెలకిందట వర్షం వచ్చి పూత అంతా రాలిపోయింది. మళ్లీ మందులు కొట్టుకుని పంటను కాపాడుకుంటే మళ్లీ ఇప్పుడు వర్షం కురుస్తుండటంతో భయాందోళనగా ఉంది. తెగుళ్లు అధికంగా పట్టుకున్నాయి.

- చెలిమి ఆంజనేయులు, గరుడంపల్లి, ధర్మవరం మండలం

### అప్రమత్తంగా ఉండాలి



బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి రానున్న రెండురోజుల్లో జిల్లాలో అక్కడక్కడా ఓ మోస్తారుగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షాలు కురిస్తే భూమిలో తేమశాతం పెరిగి, చలి తీవ్రతకు కందిపంటపై పురుగు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రైతులు అప్రమత్తంగా ఉండాలి. పురుగు నివారణకు మందులు పిచికారి చేసుకుని సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

-రామసుబ్బయ్య, ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్, పుట్టపర్తి

# వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవాలి

- కలెక్టర్ ఆనంద్



ప్రతిభ కనబరచిన విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వారసత్వ కట్టడాలను ప్రతిఒక్కరూ బాధ్యతగా పరిరక్షించుకోవాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పురావస్తు ప్రదర్శన శాలలో నిర్వహిస్తున్న ప్రపంచ వారసత్వ వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరిరోజు కార్యక్రమానికి కలెక్టర్ ఆనంద్ హాజరై, మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు నెలకోమారు ఏదో ఒకచోట నిర్వహించాలనీ, తద్వారా పిల్లలు, ప్రజలకు దేశ సంస్కృతి, వారసత్వం గురించి అవగాహన వస్తుందన్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు, వంటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పురావస్తు ప్రదర్శనశాలల శాఖ ఏడీ స్వామినాయక్, ఇంటాక్ కన్వీనర్ రామ్‌కుమార్, డిస్కవర్ అనిల్‌కుమార్, లేడీస్ క్లబ్ సెక్రటరీ పద్మనారాయణ రెడ్డి, ఇన్నర్‌వీల్ క్లబ్ జయంతి, జిల్లా పర్యాటకశాఖాధికారి జయకుమార్ బాబు పాల్గొన్నారు.

# పల్లెలకూ అన్న క్యాంటీన్లు..

(5వ పేజీ తరువాయి)

కష్టకాలంలోనూ జగన్ సర్కారు కాఠిన్యంగా వ్యవహరించింది. 2024లో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం పేదల ఆకలి విలువ తెలుసుకుని మళ్లీ అన్న క్యాంటీన్లను పునరుద్ధరించింది. ఇన్నాళ్లు నగరాలు, పట్టణాలకే పరిమితమైన అన్న క్యాంటీన్లను పల్లె పేదల చెంతకు తీసుకెళ్లేందుకు సిద్ధమైంది. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఉండే పల్లె ప్రాంతాల్లో సైతం రూరల్ అన్న క్యాంటీన్లు తీసుకొస్తోంది. వాటి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 4 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే... ఉమ్మడి జిల్లాలోనే పనులు ఊపందుకున్నాయి.

### రూ.61 లక్షలతో నిర్మాణం

నగరాలు, పట్టణాల్లో అన్న క్యాంటీన్లు నిత్యం వేలాది మందికి కమ్మని భోజనాన్ని అందిస్తున్నాయి. గ్రామాల నుంచీ మండల, నియోజకవర్గ కేంద్రాలకు వచ్చే ప్రజలకు కూడా భోజనం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రూరల్ అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 63 రూరల్ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నారు. రాయలసీమ జిల్లాలకు 13 మంజూరు కాగా... ఉమ్మడి అనంతకు 4 కేటాయించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని రాప్తాడు, బుక్కరాయసముద్రం, ఉరవకొండ, పెనుకొండ ప్రాంతాల్లో రూరల్ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నారు. నిత్యం సుమారు 300 మందికి భోజనం అందించేలా వీటిని నిర్వహించనున్నారు. రూ.61లక్షలతో ఒక్కో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.

### శరవేగంగా పనులు

రాప్తాడు, బుక్కరాయసముద్రం, ఉరవకొండ, పెనుకొండలో అన్న క్యాంటీన్ల పనులు శరవేగంగా సాగుతున్నారు. రాప్తాడు అన్న క్యాంటీన్ పనులు 90 శాతానికిపై పూర్తయ్యాయి. చివరి దశకు చేరుకున్నాయి. త్వరలో ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. ఉరవకొండ, బుక్కరాయసముద్రం, పెనుకొండలో సైతం పూర్తి కావస్తున్నాయి. రాయలసీమ వ్యాప్తంగా చూస్తే జిల్లాలోనే పనులు శరవేగంగా సాగుతున్నాయి. నిర్మాణాలు పూర్తి కాగానే నిత్యం వందలాది మంది పేదల ఆకలి తీర్చనున్నాయి.

### డిసెంబరు ఆఖరుకు పూర్తవుతాయి



ఉమ్మడి జిల్లాలో రూరల్ అన్న క్యాంటీన్ల పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే రాప్తాడులో 90 శాతానికిపైగా పూర్తయ్యాయి. ఉరవకొండ, పెనుకొండ, బుక్కరాయసముద్రం అన్న క్యాంటీన్ల పనులు సైతం వేగంగా జరుగుతున్నాయి. డిసెంబరు చివరి నాటికి అన్నీ పూర్తవుతాయి. త్వరలోనే పేదలకు అందుబాటులోకి రానున్నాయి.

- రామ్మోహన్‌రెడ్డి, ఎస్ఈ, పబ్లిక్ హెల్త్, అనంతపురం

### ప్రజలకు అందుబాటులో ఉండాలి



పనుల నిమిత్తం నిత్యం పలు ప్రాంతాల నుంచీ నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడుకు ప్రజలు వస్తుంటారు. వారికి అందుబాటులో ఉండాలని అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నాం. చాలా వేగంగా పనులు పూర్తయ్యాయి. ఆస్పత్రి, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, ఆటోనగర్‌కు పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయించాం. ఎన్ఎస్ గేటులో మరో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం.

- పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే

# అరటి రైతును ఆదుకోండి

- ప్రభుత్వం పంట కొనుగోలు చేయకపోతే నిరసన
- కలెక్టర్‌తో వైసీపీ నేతలు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న వైసీపీ నేతలు

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అరటి రైతును ఆదుకోవాలని వైసీపీ నాయకులు కోరారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, శింగనమల, కళ్యాణదుర్గం, ఉరవకొండ సమన్వయకర్తలు శైలజానాథ్, తలారి రంగయ్య, విశ్వేశ్వరరెడ్డి మంగళవారం కలెక్టర్ ఆనంద్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. జిల్లాలో రైతాంగం పడుతున్న కష్టాలను వివరించారు. ప్రస్తుతం వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ఏ సీజన్‌లోనూ ప్రభుత్వం.. రైతులను ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. అరటి రైతులు గిట్టుబాటు ధర లేక పంటను వదిలేస్తున్నారనీ, పశువులకు మేతగా వేస్తున్నారని చెప్పారు. జిల్లాలో సుమారు 40వేల ఎకరాల్లో అరటి సాగయితే 8లక్షల టన్నుల వరకు దిగుబడి వచ్చేదన్నారు. అరటికోతలు ప్రారంభమయ్యాయనీ, గిట్టుబాటు ధర లేదన్నారు. టన్ను రూ.వెయ్యి నుంచి రూ.2వేలు ఉంటే రైతులు బతికేదెలా అని ప్రశ్నించారు. డిసెంబరులో మళ్లీ అరటికోతలు ప్రారంభమవుతాయనీ, తక్షణం ప్రభుత్వమే పంటను కొనుగోలు చేయాలని కోరారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా చేస్తామని ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం తప్ప.. రైతులకు ఒనగూరిన ప్రయోజనం శూన్యమన్నారు. రెండు, మూడు రోజుల్లో స్పందించకపోతే అరటి పంటను కలెక్టరేట్ వద్ద ఉంచి నిరసన తెలియజేస్తామని స్పష్టం చేశారు. ఖరీఫ్‌లో సాగుచేసిన మొక్కజొన్న, సజ్జ, పత్తి తదితర పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. మొక్కజొన్న కనీస మద్దతు ధర రూ.2100 ఉంటే రూ.1500కు అమ్ముకునే పరిస్థితి వచ్చిందన్నారు. రబీ సీజన్ ప్రారంభమై రెండు నెలలైనా పప్పుశనగ విత్తనం పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేని దుస్థితి జిల్లాలో నెలకొందన్నారు. సుమారు రూ.2.30 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ అందాల్సి ఉందన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే రైతాంగం తరఫున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# మీ విజయం చరిత్రలో పదిలం

అంధుల మహిళా క్రికెట్ జట్టుకు కర్ణాటక సీఎం అభినందన



దీపికను సన్మానిస్తున్న కర్ణాటక సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, అమరాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అంధుల టీ-20 క్రికెట్ వరల్డ్‌కప్ సాధించిన భారతీయజట్టు విజయం చరిత్రలో నిలిచిపోతుందని, మీ గెలుపు ఎందరికో స్ఫూర్తినిస్తుందని సీఎం సిద్దరామయ్య జట్టు సభ్యులను అభినందించారు. బెంగళూరులోని సీఎం అధికారిక నివాసం 'కృష్ణ'లో మంగళవారం జట్టు సభ్యులందరినీ సీఎం ప్రత్యేకంగా అభినందించారు. జట్టు కెప్టెన్, తుమకూరు జిల్లా శిరాకు చెందిన దీపికా నాయకత్వాన్ని, ఆట నైపుణ్యాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. రానున్న రోజుల్లో మరింత సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కర్ణాటక క్రికెట్ క్రీడాకారులకు తలా రూ.10లక్షల నగదు బహుమతితోపాటు ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. జట్టులో ఇతర రాష్ట్రాలనుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులకు తలా రూ.2లక్షల బహుమతిగా ఇస్తామన్నారు. దీంతో ఇతర రాష్ట్రాలకు చెందిన 13మంది క్రీడాకారులకు తలా రూ.2లక్షల రివార్డు దక్కనుంది. ఈ సందర్భంగా స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప, ఉన్నతవిద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, సీఎం మీడియా సలహాదారుడు కేవీ ప్రభాకర్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

### జట్టును అభినందించిన విజయేంద్ర

మహిళా క్రికెట్‌జట్టును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ప్రత్యేకంగా అభినందించారు. నగరంలోని చాన్సెరి పెవిలియన్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన టీం సభ్యులను అభినందించారు. జట్టును ప్రోత్సహించిన సమర్థనం ట్రస్టు అధ్యక్షుడు, బ్లైండ్ క్రికెట్ అసోసియేషన్ మెంటార్ డాక్టర్ మహంతేశ్‌ను ప్రశంసించారు. ఎంపీ పీసీ మోహన్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శరణు తళ్ళికెరి, బెంగళూరు నగర అధ్యక్షుడు సప్తగిరి గౌడ తదితరులు పాల్గొన్నారు.

# తిప్పేసిన రాజేష్

ఆరు వికెట్లతో ఒడిశా నడ్డి విరిచిన ఆంధ్రా కెప్టెన్

ఆతిథ్య జట్టు ఘనవిజయం... చివరిరోజు బౌలర్ల హవా



వీరారెడ్డి



రాజేష్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా కెప్టెన్ రాజేష్ స్పిన్ ఉచ్చులో చిక్కి ఒడిశా బ్యాటర్లు విలవిల్లాడారు. రాజేష్ 45 పరుగులిచ్చి 6 వికెట్లు కూల్చడంతో ఒడిశా రెండో ఇన్నింగ్స్‌లో 120 పరుగులకే కుప్పకూలింది. ఆతిథ్య ఆంధ్రా జట్టు ఘన విజయం సాధించింది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించిన బీసీసీఐ కూచ్ బెహర్ క్రికెట్ ట్రోఫీ అండర్-19 క్రికెట్ మ్యాచ్ మూడోరోజైన మంగళవారం ఆంధ్రా బౌలర్లు చెలరేగిపోయారు. ఆంధ్రా జట్టు ఓవర్‌నైట్ స్కోరు 46-2తో మూడోరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. 94.2 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 215 పరుగుల వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. లోకల్‌బాయ్ వీరారెడ్డి హాఫ్ సెంచరీ (77)తో రాణించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో ఆంధ్రా 94.4 ఓవర్లలో 282 పరుగులకు ఆలౌటైంది. ఒడిశా 63.1 ఓవర్లలో 124 పరుగులకు ఆలౌటైంది. 374 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఒడిశా 54.2 ఓవర్లలో 120 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్రా కెప్టెన్ రాజేష్ 6, ఏఎన్‌వీ లోహిత్ 3 వికెట్లు పడగొట్టారు. దీంతో ఆంధ్రా 253 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది.

## ఆంధ్రా టీ20 జట్టుకు వినయ్‌కుమార్



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా సీనియర్ టీ20 జట్టులో జిల్లాకు చెందిన వినయ్‌కుమార్‌కు చోటు దక్కింది. రాష్ట్ర జట్టును మంగళవారం ప్రకటించారు. లక్నోలో ఈనెల 26వతేదీ నుంచి నిర్వహించే బీసీసీఐ సీనియర్ సయ్యద్ ముస్తాక్ ఆలీ టోర్నీలో ఆంధ్రా జట్టుకు వినయ్‌కుమార్ ప్రాతినిధ్యం వహించనున్నాడు.

## ధర్మవరం కుర్రాడు అదుర్స్

అంతర్జాతీయ చెస్ టైటిల్ కైవసం



సహృద్‌కి ట్రోఫీ అందజేస్తున్న రవినాయుడు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధర్మవరానికి చెందిన సహృద్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో సత్తాచాటాడు. ఏకంగా టైటిల్‌నే కైవసం చేసుకున్నాడు. ఫణికుమార్, దీప్తి దంపతుల కుమారుడైన సహృద్ ఏడో తరగతి చదువుతున్నాడు. విజయవాడలో రెండు రోజులపాటు నిర్వహించిన ఇంటర్నేషనల్ చెస్ టోర్నీలో 800 మందికిపైగా క్రీడాకారులు పోటీపడ్డారు. అందులో సహృద్ 1800బి రేటింగ్ విభాగంలో 9 రౌండ్లకుగాను ఎనిమిదింటిలో గెలిచి టైటిల్ సొంతం చేసుకున్నాడు. శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు చేతుల మీదుగా ట్రోఫీ అందుకున్నాడు. సహృద్‌ను చీఫ్ కోచ్ ఆదిరత్న కుమార్ అభినందించారు.

# హాకీలో అనంత జట్ల సత్తా



బాలికల హాకీ జట్టును అభినందిస్తున్న డీఈఓ, ఏడీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి హాకీ అండర్-14 చాంపియన్‌షిప్‌లో అనంత జట్లు సత్తాచాటాయి. చంద్రగిరిలో నిర్వహించిన పోటీల్లో జిల్లా బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచింది. బాలుర జట్టు తృతీయ స్థానం దక్కించుకుంది. బాలికల్లో మాన్య, శ్రీలేఖ, ప్రియాంక, బాలురలో ఉదయ్‌కుమార్, విక్కీ రాష్ట్ర జట్లకు ఎంపికయ్యారు. నక్కపల్లిలో నిర్వహించిన అండర్-19 హాకీ టోర్నీలో బాలికల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. వైష్ణవి, జయశ్రీ బాలికల రాష్ట్ర జట్టుకు, అభిషేక్ బాలుర జట్టుకు ఎంపికయ్యారు. మచిలీపట్నంలో నిర్వహించిన అండర్-14 కబడ్డీ పోటీల్లో అనంత బాలికల జట్టు తృతీయ స్థానం సాధించింది. బాలికల్లో భానుశ్రీ, ఆయుష, బాలురలో వన్నూరుస్వామి రాష్ట్ర జట్లకు ఎంపికయ్యారు. కర్నూలులో నిర్వహించిన రగ్బీ పోటీల్లో జిల్లా బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచింది. బాలికల్లో లాస్యప్రియ, వీరనారమ్మ, బాలుర జట్టు నుంచి నవదీప్ రాష్ట్ర జట్లలో చోటు దక్కించుకున్నారు. ఎంపికైన క్రీడాకారులను మంగళవారం డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీ మునీర్‌బాషా అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, శకుంతల, సుహాసిని, పీడీలు రాగేష్‌బాబు, నాగరాజు, అంజనాబాయి, సునీత పాల్గొన్నారు.

## డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం డిజిటల్ పేమెంట్ చేయండి

● ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి

అనంతపురం అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం డిజిటల్ పేమెంట్ ద్వారా రైతులు నాన్‌సబ్సిడీ డబ్బులు చెల్లించాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యవర్తులు, దళారులను నమ్మి డబ్బు చెల్లించరాదన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి, మోసపోకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# కల నిజమాయెగా..!

మడకశిర రెవెన్యూ డివిజన్‌కు ఆమోదం

పెనుకొండలోకి గోరంట్ల, పుట్టపర్తిలోకి అమడగూరు

మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులకు ఓకే చెప్పిన సీఎం



మడకశిర తహసీల్దార్ కార్యాలయం

పుట్టపర్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్‌ల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఆమోదం తెలిపారు. ఈ క్రమంలో మడకశిర ప్రజల చిరకాల వాంఛ.. 'మడకశిర రెవెన్యూ డివిజన్' నెరవేరడం ఖాయమైంది. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలోని మంత్రి వర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులలో మడకశిర రెవెన్యూ డివిజన్‌కు చోటు దక్కింది. దీనిపై అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ క్రమంలో జిల్లాలో అతి పెద్ద రెవెన్యూ డివిజనగా ఉన్న పెనుకొండ నుంచి మడకశిర విడిపోనుంది.

### పట్టించుకోని వైసీపీ..

వైసీపీ హయాంలో 2022లో కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో మడకశిరను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు, ప్రజలు ఆందోళన చేశారు. కానీ నాటి ప్రభుత్వం స్పందించలేదు. గోరంట్ల మినహా పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాలను కలిపి పెనుకొండ రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో అప్పట్లో మడకశిర ప్రజలు తీవ్ర అసంతృప్తి చెందారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గత ఏడాది ఆగస్టులో సీఎం చంద్రబాబు గుండుమలలో పర్యటించారు. ఆ సమయంలో రెవెన్యూ డివిజన్ అంశాన్ని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించారు. జిల్లాల పునర్విభనకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పడ్డాక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ సహా పలువురు టీడీపీ నాయకులు వినతి పత్రాలను సమర్పించారు. ఇలా.. ప్రజల ఆకాంక్ష నెరవేరుతోంది.

### ఇవే మార్పులు..

మడకశిర నియోజకవర్గంలోని అగళి, అమరాపురం, గుడిబండ, రొళ్ల, మడకశిర మండలాలతో ప్రత్యేక రెవెన్యూ డివిజన్ అవతరిస్తోంది. పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లోని గోరంట్ల మండలాన్ని పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లోకి చేరుస్తారు. కదిరి రెవెన్యూ డివిజన్‌లోని ఆమడగూరు మండలాన్ని పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేస్తారు. తాజా మార్పులతో పెనుకొండ, పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లలో ఆయా నియోజకవర్గాల్లో అన్ని మండలాలు చేరుతాయి. దీనివల్ల పరిపాలనా సౌలభ్యం కలుగుతుంది. పరిపాలన, భౌగోళిక, సామాజిక, ఆర్థిక సమస్యలను పరిష్కరించేలా మార్పులు చేశారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యాప్రమాణాల పెంపు దిశగా..!

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక అమలు

1 నుంచి 5 తరగతులకు ఎఫ్ఎల్ఎన్ పేరుతో పరీక్ష

డైట్ విద్యార్థుల సహకారంతో యాప్ ద్వారా టెస్ట్



పెద్దపప్పూరు మండలం జూటూరు ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ పరీక్షను పర్యవేక్షిస్తున్న డైట్ లెక్చరర్లు

అనంతపురం విద్య, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలలో విద్యా ప్రమాణాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థుల్లో 60, 70 శాతం మందికి చదవడం, రాయడం రావడంలేదని, కనీసం అంకెలు కూడా గుర్తించలేక పోతున్నారని ఇటీవల కేంద్రం ఓ సంస్థతో నిర్వహించిన సర్వేలో తేలింది. ఆ నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కేంద్రం తెచ్చింది. దీంతో ప్రాథమిక స్థాయిలో కూడా విద్యాప్రమాణాల పెంపునకు ప్రభుత్వం అడుగులు వేసింది. ఇందుకోసం విద్యాశాఖామంత్రి నారా లోకేశ్, విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్ ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరాసీ)పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు.

### 1427 పాఠశాలలు.. 83,877మంది విద్యార్థులకు పరీక్ష

ఎఫ్ఎల్ఎన్ పేరుతో విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్నారు. ఈ ప్రక్రియలో ప్రధానంగా ప్రాథమిక స్థాయి విద్యార్థులు అక్షరాలను గుర్తించడం, చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలు కలిగి ఉండాలి. అలాగే ప్రాథమిక గణిత ప్రక్రియలు, సంఖ్యలను అర్థం చేసుకోవడం వంటి నైపుణ్యాలు ఏమేరకు ఉన్నాయో తెలుసుకోవడానికి పరీక్ష నిర్వహిస్తున్నారు. జిల్లాలో 135 క్లస్టర్స్ ఉండగా, ఈపరిధిలో 1427 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో విద్యాశాఖ రికార్డుల మేరకు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 83,877మంది చదువుతున్నారు. వీరందరికి సోమవారం నుంచి ఎఫ్ఎల్ఎన్ పరీక్షలు మొదలు పెట్టారు. ఒక్కో క్లస్టర్‌కు ఒక్కో డీఎడ్ విద్యార్థిని నియమించి వారిద్వారానే ఈపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎటువంటి పక్షపాతానికి అవకాశం లేకుండా లీప్‌యాప్‌లో రాష్ట్ర స్థాయిలోనే ప్రశ్నాపత్రం రూపొందించి, పొందుపరిచారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులలో ఒక్కోదానికి 16మార్కులకు ప్రశ్నాపత్రం తయారు చేసి పిల్లలను టెస్ట్ చేస్తున్నారు. డీఈఓ ప్రసాద్ బాబు, డైట్ ప్రిన్సిపాల్, డైట్‌లెక్చరర్ల పర్యవేక్షణలో ఈఎఫ్ఎల్ఎన్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. సోమ, మంగళవారంలో 129 క్లస్టర్ల పరిధిలో 1797ప్రాథమికపాఠశాలలో 54,681మందివిద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ పరీక్షలు పూర్తి చేశామని, ఈనెల 28లోగా అందరికీ పరీక్షలు పూర్తి చేస్తామని డీఈఓ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు.

## గంజాయి కేసులో ఏడుగురి అరెస్టు

4.250 కేజీల గంజాయి, 8 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ, సిబ్బంది

అనంతపురం క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ఏడుగురు నిందితులను అనంతపురం త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచీ 4.25 కేజీల గంజాయి, 8 సెల్‌ఫోన్లు, రూ.2700 నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు వివరాలను త్రీటౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. బెళుగుప్పకు చెందిన మనోజ్ కుమార్, అనంతపురంలో ఆరో రోడ్డు ప్రాంతానికి చెందిన షేక్ అస్లాం బాషా అలియాస్ బబ్లూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలయ్యారు. గంజాయి కొనేందుకు సులువుగా డబ్బు సంపాదించాలని హాజీ రహమత్ అలియాస్ కురుగుంట బువ్వమ్మతో పరిచయం పెంచుకున్నారు. ఈ ముగ్గురూ మూడో రోడ్డు ప్రాంతంలో ఉండే రవికుమార్ అలియాస్ పాషి, టీవీ టవర్ ప్రాంతానికి చెందిన ఏలూరు సాలోమన్ అలియాస్ మురళి, తపోవనానికి చెందిన జ్యోతుల ప్రవీణ్‌కుమార్ అలియాస్ లడ్డూ, కళ్యాణదుర్గం బైపాస్ వాసి దినేష్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. గంజాయి విక్రయాల ద్వారా వచ్చిన సొమ్ముతో తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. ఈ క్రమంలోనే మనోజ్, అస్లాంబాషా, బువ్వమ్మ ఇటీవల విశాఖపట్నం జిల్లా తునికి వెళ్లి.. అక్కడ రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి వద్ద 10 కేజీల గంజాయి కొన్నారు. రైలులో అనంతపురం తీసుకొచ్చారు. అందులో 4 కేజీల గంజాయిని కర్ణాటక రాష్ట్రం బాగేపల్లికి తీసుకెళ్లి కేజీ రూ.18 వేలకు విక్రయించారు. తర్వాత మరో 1.25 కేజీల గంజాయికి 100 గ్రాముల చొప్పున చిన్న ప్యాకెట్లుగా చేసి రూ.2 వేలకు అనంతపురం నగర పరిసరాల్లో విక్రయించారు. మిగిలిన 4.25 కేజీల గంజాయిని అమ్ముకోడానికి అనంతపురం నగర పరిసర ప్రాంతమైన రాజీవ్ కాలనీ వద్ద నాగులకట్ట సమీపంలో పంచుకుంటుండగా పోలీసులు అరెస్టుచేశారు. నిందితుల నుంచి గంజాయి, సెల్‌ఫోన్లు, బైక్, నగదు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టా భూములను ఆక్రమించారు..!

ప్రైవేటు కంపెనీ వద్ద రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్ రెడ్డి, నాయకులు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చెరువు కింద ఉన్న తమ పట్టా భూములను ప్రైవేటు కంపెనీవారు ఆక్రమించారని బాధిత రైతులు ఆందోళనకు దిగారు. కంపెనీ ఎదుట మంగళవారం బైఠాయించారు. బాధితులు తెలిపిన మేరకు, న్యామద్దల చెరువు ఆయకట్టు సర్వే నంబరు 177-1లో నితీష్ కుమార్, ఉమేశ్వరి, ఎర్రమ్మకు 46 సెంట్లు, సర్వేనంబరు 195లో అహోబిళప్పకు 35 సెంట్ల భూమి ఉంది. హనుమే నాయక్‌కు సర్వే నంబరు 177-1లో ఎకరం, సర్వే నంబరు 192లో 30 సెంట్ల భూమి ఉంది. ఈ భూములను తరతరాలుగా తాము సాగు చేసుకుంటున్నామని రైతులు అంటున్నారు. ఆయకట్టు పరిధిలో ఏర్పాటైన ఓ ప్రైవేటు కంపెనీ తమ భూములను ఆక్రమించిందని వాపోయారు. దీని గురించి ప్రశ్నిస్తే.. న్యాయం చేస్తామని చెబుతూ కంపెనీ ప్రతినిధులు కాలయాపన చేస్తున్నారని అన్నారు. దీంతో సర్వే చేసి తమ భూములను గుర్తించి ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు విన్నవించామని తెలిపారు. సర్వే చేసేందుకు అధికారులు మంగళవారం వచ్చారని, కంపెనీ నిర్వాహకులు వారిని లోనికి అనుమతించలేదని, దీంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారని అన్నారు. సీపీఐ మండల నాయకుడు ముత్యాలప్పతో కలిసి వారు ఆందోళనకు దిగారు. కంపెనీ వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్ రెడ్డి, పార్టీ నాయకులు అక్కడికి వెళ్లి విచారించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

### ల్యాబ్ నిర్వహణపై శిక్షణ

అనంతపురం విద్య, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అటల్ టింకరింగ్ ల్యాబ్ నిర్వహణపై మూడ్రోజులు నిపుణుల చేత ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, సైన్స్ ఆఫీసర్ బాలమురళి మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. జిల్లా సైన్స్‌సెంటర్‌లో బుధవారం నుంచి శుక్రవారం వరకు శిక్షణ ఉంటుందన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉన్న ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ల్యాబ్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులు శిక్షణకు హాజరుకావాలన్నారు.

## పాపను తీసుకెళ్లండి

ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి



అనంతపురం వైద్యం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని శిశుగృహలో సంరక్షణ పొందుతున్న 60 రోజుల చిన్నారిని తల్లిదండ్రులు లేదా రక్తసంబంధీకులు తగిన ఆధారాలు సమర్పించి తీసుకెళ్లవచ్చునని ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. రెండు నెలల క్రితం నగరంలోని సాయినగర్ 7వ క్రాస్‌లో నవజాత శిశువును (బాలిక) వదిలేసి వెళ్లిపోయారని తెలిపారు. తాము వైద్య పరీక్షలు చేయించి, శిశుగృహలో సంరక్షిస్తున్నామని తెలిపారు. బాలిక తల్లిదండ్రులు, రక్తసంబంధీకులు 30రోజులలోపు రాకపోతే నిబంధనల మేరకు అనాథగా ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం దత్తత కోరేవారికి చట్టబద్ధంగా దత్తత ఇస్తామని తెలిపారు. వివరాలకు ఐడీసీఎస్ పీడీ కార్యాయాన్ని సంప్రదించాలని కోరారు.

### 41 దరఖాస్తులు..

మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి(వన్‌స్టాప్) సెంటర్‌లోని పోస్టులకు 41 దరఖాస్తులు వచ్చినట్లు ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 25వ తేదీ వరకు ఫిజియో సోషల్ కౌన్సిలర్‌కు ఏడు, మల్టీపర్పస్ స్టాఫ్/కుక్‌కు 11, సెక్యూరిటీ గార్డ్/ నైట్ వాచ్‌మెన్‌కు 23.. మొత్తం 41 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఎంపిక, స్క్రూటినీ తదితర వివరాలు త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై శిక్షణ

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాకు సంబంధించి మంగళవారం కలెక్టరేట్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)-2026పై ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఈడీటీలు, ఈఎస్‌ఏఎస్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా డీఆర్ఓ మలోల మాట్లాడుతూ... 2002 ఓటరు జాబితా ప్రకారం 2025 ఓటర్ లిస్ట్‌లో వారి వారసులతో మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. పెండింగ్ క్లెయిమ్స్ పూర్తి చేయడంపై పలు సూచనలు ఇచ్చారు. ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఈడీటీలు, ఈఎస్‌ఏఎస్‌లు తమ నియోజకవర్గాల్లో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్‌లకు శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, ఎలక్షన్ సెల్ డిప్యూటీ తహసీల్దార్ కనకరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్ ఎస్‌ఈగా సంజీవరాయుడు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల (ఎన్‌హెచ్) విభాగం అనంతపురం సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్‌ఈ)గా సంజీవరాయుడును నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి క్రిష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌హెచ్ విభాగంలోనే విజయవాడలో ఈఈగా పనిచేస్తున్న ఈయనకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ జిల్లాకు బదిలీ చేశారు. ఇక్కడ ఎస్‌ఈగా పనిచేస్తున్న హరిప్రసాద్ బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో ఈఈ సుధాకర్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇయన కూడా నెలాఖరులో ఉద్యోగ విరమణ పొందుతుండటంతో రెగ్యులర్ ఎస్‌ఈని నియమించారు.

### ఈఈగా సిద్దారెడ్డి..?

సుధాకర్‌రెడ్డి ఉద్యోగ విరమణతో ఖాళీ పడనున్న ఈఈ స్థానానికి కర్నూలు ఎస్‌ఈ టూ పీఏగా ఉన్న సిద్దారెడ్డిని నియమించే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది. గతంలో ఇక్కడ ఆర్‌అండ్‌బీ ఈఈగా పనిచేసిన రాజగోపాల్ సైతం ఎన్‌హెచ్ ఈఈ స్థానం కోసం ప్రయత్నం చేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆయననే నియమిస్తారని కూడా చర్చ జరిగింది. స్థానిక ప్రజాప్రతినిధులు.. ఆర్ అండ్‌బీలోనే ఉండాలని సూచించడంతో ఆయన ప్రయత్నాలు విరమించుకున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆ తర్వాత సిద్దారెడ్డి రాకపై ప్రచారం ఊపందుకుంది. మరో అధికారి కూడా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది.

## పేలిన పెయింట్ డబ్బా

ఒకరికి తీవ్రంగా, ఇద్దరికి స్వల్పంగా గాయాలు

ధర్మవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పెయింట్ డబ్బా పేలి ఒకరు తీవ్రంగా, ఇద్దరు స్వల్పంగా గాయపడిన సంఘటన పట్టణంలో మంగళవారం జరిగింది. ఒడిశా రాష్ట్రానికి చెందిన కమలేశ్, కేతన్‌లాల్ కుటుంబాలతో కలిసి ఆరేళ్ల కిందట ధర్మవరం వచ్చారు. పట్టణంలోని షిర్డీసాయి బాబా ఆలయ సమీపంలో రోడ్డు పక్కన గుడారాలు వేసుకుని షోకేస్‌లో ఉంచుకునే బొమ్మలు తయారు చేసి, విక్రయిస్తూ జీవనం సాగించేవారు. ఈక్రమంలో కమలేశ్ మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో గుడారం సమీపంలో చెత్తకు నిప్పుపెట్టాడు. అయితే దాని కింద బొమ్మల తయారీకి వాడే పెయింట్ డబ్బా ఉండటం గమనించలేదు. దీంతో వేడికి డబ్బా పేలింది. దీంతో కమలేశ్ అరచేయి ఛిద్రమైంది. కళ్లకు గాయాలు అయ్యాయి. సమీపంలో ఉన్న కేతన్‌లాల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో అటు వైపు వెళ్తున్న పట్టణానికి చెందిన అశోక్‌కుమార్ కూడా స్వల్పంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

### శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పెనుకొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ జయప్ప, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. వెబ్, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, పర్యాటకం, హాస్పిటాలటీ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఆపై చదువులు చదివినవారు అర్హులన్నారు. ఆసక్తిగలవారు 9966682246 నంబరులో సంప్రదించాలన్నారు.

## జవాబుదారీతనంతో కాంగ్రెస్ నిర్మాణం

ఏఐసీసీ పరిశీలకులు పరమేశ్వర నాయక్



మాట్లాడుతున్న పరమేశ్వర నాయక్

అనంతపురం వైద్యం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బలమైన, జవాబుదారీతనంతో ప్రజలకు అనుసంధానంగా కాంగ్రెస్ పార్టీ నిర్మాణం కావాలని ఏఐసీసీ పరిశీలకుడు పరమేశ్వర నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. డీసీసీ మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పరమేశ్వర నాయక్ మాట్లాడుతూ పార్టీ పునర్నిర్మాణం చేయడానికి సంఘటన్ సృజన్ అభియాన్(ఎస్ఎస్ఏ)ను రాహుల్ గాంధీ చేపట్టారన్నారు. భారత్ జోడో, భారత్ జోడో న్యాయ్ యాత్ర స్ఫూర్తితో కాంగ్రెస్ సిద్ధాంతాల్ని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఏపీసీసీ పరిశీలకులు అల్లాబకాష్, మహమ్మద్, అలీఖాన్, అంబటి రామకృష్ణయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమామ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈరన్న పాల్గొన్నారు.

# వైసీపీలో భగ్గుమన్న వర్గపోరు

కుర్చీలతో దాడులకు యత్నం



కుర్చీలతో దాడి చేసుకుంటున్న ఇరువర్గాలు

మడకశిరటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గ వైసీపీలో వర్గపోరు భగ్గుమంది. పట్టణంలో మంగళవారం జరిగిన వైసీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో రెండు వర్గాల నాయకులు పరస్పరం దాడులకు యత్నించారు. గత నెలలో రొళ్ల ఎంపీపీపై సొంత పార్టీలోనే ఒక వర్గానికి చెందిన నాయకులు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అధిష్ఠానం వద్దన్నా పంతం పట్టి అవిశ్వాసాన్ని నెగ్గించారు. దీంతో రొళ్లలో వైసీపీకి చెందిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ తమ పదవులు కోల్పోయారు. అప్పటి నుంచి ఇరు వర్గాల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. మంగళవారం మడకశిరలో వైసీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశం జరుగుతుండగా రొళ్ల ఎంపీపీ అవిశ్వాస తీర్మానంపై చర్చ లేపారు. ఒక వర్గానికి చెందిన వారు టీడీపీలోకి వెళ్లాలని ప్రోత్సహించారంటూ ఆరోపణలు చేసుకోసాగారు. ఈసమయంలోనే వైసీపీ సమన్వయ కర్త ఈరలక్కప్పకు రొళ్ల మండల కన్వీనర్ నరసింహారెడ్డి మధ్య మాటల యుద్ధం సాగింది. ఈక్రమంలో ఇరువర్గాల వారు చెయిర్‌లు తీసుకుని దాడులకు దిగారు. దీంతో అక్కడ ఉన్న కొందరు నాయకులు సర్దిచెప్పి సమావేశాన్ని కొనసాగించారు. వైసీపీలో నెలకొన్న ఈ వర్గపోరు భరించలేక అనేకమంది తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నారు.

న్యూస్ బాక్స్

## మధ్యాహ్న భోజన నాణ్యతపై నిఘా : ఏడీ



పిల్లలకు భోజనం వడ్డిస్తున్న విద్యాశాఖ ఏడీ శ్రీనివాసులు

అనంతపురం విద్య, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై నిరంతరం నిఘా ఉంటుందని ఆ విభాగం పర్యవేక్షకుడు, విద్యాశాఖ ఏడీ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం ఆయన కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం మండలాల్లోని వివిధ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయంగా పిల్లలకు భోజనం వడ్డించారు. భోజనం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని, ప్రత్యేకంగా సన్నబియ్యం, సరఫరా చేయడంతో పాటు ధరలు పెంచారని తెలిపారు. ప్రతి పాఠశాలలోనూ మెనూ మేరకు భోజనం అందించాలని, ఈ మేరకు హెచ్ఎంలు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు.

## స్థానిక ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యం



మండల నూతన కన్వీనర్ లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న కార్యకర్తలు

బుక్కరాయసముద్రం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేస్తామని టీడీపీ మండల నూతన కన్వీనర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద లక్ష్మీనారాయణను టీడీపీ కార్యకర్తలు, నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమపై నమ్మకం ఉంచి కన్వీనర్ పదవి ఇచ్చినందుకు జోనల్ -5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ, టూమెన్ కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, నాయకులు రామలింగారెడ్డి, పర్వతనేని శ్రీధర్‌బాబు తదితర నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో కార్యకర్తలను, అభిమానులకు కలుపుకుని పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, కేశన్న, ఎస్.నారాయణస్వామి, నారాయణస్వామి, బాబయ్య, హరి, చితంబరి, చిన్నిపటేల్‌బూషి, హరి, మహేశ్, రామూర్తి, సుధీర్, దాసి పాల్గొన్నారు.

## నేడు కొత్తగాదికుంటలో ఎమ్మెల్యే పర్యటన

రామగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగాదికుంట గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే పరిటాల సునీత పర్యటించనున్నట్టు టీడీపీ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. కొత్తగాదికుంటలోని అక్కమ్మగార్లగుడి వద్దగల దేవదాయ భూముల్లో ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమం చేపడతారని తెలిపారు. రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

## సెంట్రల్ వర్సిటీ వీసీతో ఎంపీ భేటీ

అనంతపురం క్రైం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రంలోని సెంట్రల్ యూనివర్సిటీ వీసీ కోరితో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మంగళవారం సమావేశమయ్యారు. వర్సిటీ ఆవరణలో వీసీతో కలసి మొక్కలు నాటారు. తర్వాత ఎంపీ మాట్లాడుతూ... యువత నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు అవసరమైన కోర్సులు ప్రవేశపెట్టాలన్నారు. ముఖ్యంగా ఏఐ టెక్నాలజీ వంటి కోర్సులను తీసుకురావాలన్నారు. అదేవిధంగా వర్సిటీ కాంపౌండ్ గోడ, తాగునీరు, జంతలూరు నుంచి కొర్రపాడు వరకూ రోడ్డు, బస్ షెల్టర్ నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు.

## పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

ఆత్మకూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. మండల కేంద్రంలో మంగళవారం రైతన్నా.. మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తాము పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఏఓ జ్యోతికుమార్, టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు మనోరంజన్, వేణుగోపాల్, ఓబులపతి, తిక్కస్వామి, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాసా కిట్ల పంపిణీ



నాసాకిట్లు అందుకున్న విద్యార్థులతో ఏజీఎం, ప్రిన్సిపాల్

అనంతపురం విద్య, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య విద్యార్థులకు ఆ సంస్థ యాజమాన్యం రాంనగర్ బ్రాంచ్‌లో నాసా కిట్లు పంపిణీ చేసింది. మంగళవారం ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు కిట్లను పంపిణీ చేసారు. అనంతరం ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి తననుతాను నిరూపించుకోవడానికి శ్రీచైతన్య విద్యాసంస్థ అవకాశం కల్పిస్తోందన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను శ్రీచైతన్య విద్యాసంస్థ ద్వారా అమెరికాలోని నాసా స్పేస్ సెంటర్‌కు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్, కోఆర్డినేటర్ రాధాక్రిష్ణ, డీన్ భవిత, నాసా ఇన్‌చార్జ్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి మరమ్మతులు

అనంతపురంరూరల్,నవంబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లిలో వెలసిన పురాతన ఆలయానికి గ్రామ సర్పంచ్ శివశంకర్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. తన సొంత నిధులు రూ.25వేలతో గుడి ప్లాస్టింగ్, సీలింగ్ పనులు చేయిస్తున్నారు. మంగళవారం ఆలయం వద్ద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు.



ఆలయ మరమ్మతులను పరిశీలిస్తున్న సర్పంచ్ శివశంకర్

# ఆట స్థలంలో అరాచకాలు..!

- మైదానంలోనే బాలికల వసతి గృహం
- మద్యం బాటిళ్లతో యువకుల హంగామా
- ఆన్‌లైన్ గేమ్స్‌కు నిలయం
- పట్టించుకోని పోలీసులు



బాలికల వసతి గృహం ఆవరణలోని ఆట స్థలం, అందులో మద్యం బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు, యువకులు ధ్వంసం చేసిన ప్రహరీ

శింగనమల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కళాశాల, పాఠశాలలకు చెందిన ఆట స్థలం ఆకతాయి ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. సంబంధిత అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రమైన శింగనమలలోని కళాశాల, పాఠశాల మైదానాన్ని మందుబాబులు, యువకులు ఇష్టారాజ్యంగా వాడుకుంటున్నారు. యువకుల బర్త్‌డే వేడుకలకు, మద్యం తాగడానికి అడ్డాగా మారిపోయింది. బాటిళ్లతో వాహనాలు నడుపుతూ హంగామా చేస్తున్నా అడిగేవారు లేరు. ఆటస్థలానికి ప్రహరీ సరిగా లేకపోవడంతో పగలు రాత్రి అనే తేడా లేకుండా యువకులు మద్యం తాగుతూ.. ఆన్‌లైన్ గేమ్స్ ఆడుకుంటూ అక్కడే తిష్ట వేయడంతో.. విద్యార్థినులు, ఉపాధ్యాయినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శింగనమల జిల్లా పరిషత్ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆటస్థలం ఉంది. ఈ ఆవరణంలోనే బాలికల వసతి గృహం ఉంది. ప్రహరీ సమీపంలోనే అంగన్‌వాడీ కేంద్రం ఉంది. ఆట స్థలానికి ఉన్న ప్రహరీ చుట్టూ ఉన్న గోడలను ధ్వంసం చేశారు. రాత్రి 7 గంటల వరకు వసతి గృహం విద్యార్థులు ఆట స్థలం వద్ద తిరుగుతుంటారు. ఇక్కడే తిష్టవేసి కొందరు యువకులు నిత్యం ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతుంటారు. మరికొందరు మద్యం సేవిస్తుంటారు. రాత్రి సమయంలో యువకులు బర్త్‌డేలు చేసుకుంటూ.. ద్విచక్ర వాహనాలతో హంగామా చేస్తుంటారు. ఇటీవల ఓ యువకుడి బర్త్‌డే ఫంక్షన్ చేసుకున్నారు. బీరు బాటిళ్లతో అల్లరి చేస్తుండడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిని అంతుచూస్తామంటూ బెదిరింపులకు దిగారు. పోలీసులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నిత్యం ఇక్కడ యువకులు అల్లరి చేస్తున్నా పోలీసులు పట్టించుకోలేదని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. మైదానం మొత్తం మద్యం బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ గ్లాసులతో నిండిపోయింది. ఇప్పటికయినా పోలీసులు, విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

### పోలీసులకు ఫిర్యాదు చేశాం

ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలకు చెందిన ఉమ్మడి ఆటస్థలంలో కొందరు యువకులు, మద్యం ప్రియులు సాయంత్రం, రాత్రి సమయాల్లో మద్యం సేవించి అక్కడే బాటిళ్లు వేస్తున్నారు. ఈ విషయమై రెండు నెలల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశాం. పోలీసులు కొద్దిరోజుల గస్తీ ఏర్పాటు చేయడంతో కొంతకాలం నియంత్రణలో ఉండేది. ఇటీవల కాలంలో పోలీసుల గస్తీ లేకపోవడంతో షరా మామూలుగా మద్యం ప్రియులు అక్కడే తాగి బాటిళ్లు పగులగొడుతున్నారు. దీంతో మైదానంలో విద్యార్థులకు ఎలాంటి ఆటలు నేర్పించలేకపోతున్నాం. ఆటస్థలం ఆవరణంలోనే బాలికల వసతి గృహం ఉండడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వార్డెన్ మా దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

-చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల

## మౌనగిరి ఆంజనేయస్వామి పూజల్లో ఎమ్మెల్యే, ఎంపీ



నృత్య కోలాట సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆలయంలోకి వెళుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

రాప్తాడు/అనంతపురం క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హంపాపురం సమీపంలో ఉన్న మౌనగిరి ఆంజనేయస్వామి 8వ వార్షికోత్సవ వేడుకలకు మంగళవారం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు. ముందుగా వారు ఆంజనేయస్వామికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ.. దేశంలోనే ఎత్తయిన 39 అడుగుల ఏకశిలా ఆంజనేయస్వామి విగ్రహం హంపాపురంలో ఉండటం తమ అదృష్టమన్నారు. అనంతరం ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ అధ్యక్షురాలు దేవరకొండ కౌసల్య బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. వేడుకలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు.తర్వాత ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆంజనేయస్వామికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ మాట్లాడుతూ..మౌనగిరి క్షేత్రాన్ని ఈశ్వరయ్య, ఆలయ కమిటీ సభ్యులు ఎంతగానో అభివృద్ధి చేస్తున్నారని అభినందించారు.

## ఏఐ ద్వారా బోధన అలవర్చుకోవాలి: వీసీ



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ సుదర్శనరావు

అనంతపురంరూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆరిఫిషియల్ ఇంటెలిజెన్సీ (ఏఐ)ని వినియోగించి నూతన బోధన పద్ధతులను అలవర్చుకోవాలని జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శనరావు పేర్కొన్నారు. మంగళవారం వర్సిటీలో ఆర్యాన్స్ అండ్ మ్యాట్ ల్యాబ్ సంయుక్తంగా సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఏ బ్రాంచ్ వారైనా ఏఐని ఏవిధంగా వాడాలో తెలుసుకోవాలన్నారు. ఆరు నుంచి ఏడు నిమిషాలు పాటు వీడియోలు చేసి తరగతి గదిలో చర్చించి వినూత్నమైన బోధన పద్ధతులను చేయాలన్నారు. మ్యాట్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు తాము చదువుతున్న సబ్జెక్టులపై ప్రాక్టికల్ అవగాహనను పెంచుకోవడమే కాకుండా పరిశోధనల కోసం కూడా ఉపయోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడుతూ.. మ్యాట్ ల్యాబ్ అనేది ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు మాత్రమే అనే అపోహ ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు యువత మేధస్సును ప్రోత్సహించడానికి ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, ఆర్యాన్స్ ఇన్ ప్రైవేట్ లిమిటెడ్ సభ్యులు నరేష్‌బాబు, ఉదయ్‌కుమార్, చందన తదితరులు పాల్గొన్నారు.

## బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాలసుబ్రహ్మణ్యం



నియామక ఉత్తర్వులు ఇస్తున్న వీసీ అనిత

అనంత పురంరూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని బి.ఎడ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ జి. బాలసుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అనిత నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈయన ప్రస్తుతం తెలుగు విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. గతంలో వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు.

## పంచాయతీ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నం

నార్పల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఇంటికి తన పేరుతో పన్ను రశీదు ఇవ్వలేదన్న కారణంతో మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో మంగళవా రం పెద్దన్న పెట్రోల్ పోసుకుని, ఆత్మహత్యకు యత్నించాడు. తన పేరుతో రశీ దు ఇవ్వాలని ఆరు నెలలుగా అడుగుతున్నా.. అధికారులు పట్టించుకోవట్లేదని నార్పలకు చెందిన పెద్దన్న వాపోయాడు. ఈ నేపథ్యంలో మంగళవారం పంచాయతీ కార్యాలయానికి వచ్చి అధికారులతో వాదనకు దిగాడు. వెంట తెచ్చుకున్న పెట్రోల్ ఒంటిపై పోసుకుని, ఆత్మహత్యకు యత్నించాడు. అక్కడే ఉన్న సిబ్బంది పెట్రోల్ బాటిల్ లాక్కున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్యామలను అడగ్గా.. నిబంధనల ప్రకారం ఇంటి పన్ను కేటాయిస్తామనీ, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

## భవనం పైకెక్కి యువతి హల్‌చల్

### దూకేస్తానంటూ బెదిరింపు.. నచ్చజెప్పి కిందకు దింపిన పోలీసులు

నార్పల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేం ద్రంలోని కొత్త బస్టాండు కాలనీ కి చెందిన ఓ యువతి మూడంతస్తుల భవనం ఎక్కి మంగళవారం హల్‌చల్ చేసింది. అక్కడి నుంచి దూకేస్తాన ని బెదిరించింది. పోలీసులు వెంటనే చేరుకుని యువతికి కౌన్సెలింగ్ ఇచ్చి కిం దకు దింపారు. కుటుంబ సభ్యులకు అప్పగించారు. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దని ట్రైనీ ఎస్ఐ గౌతమ్ సూచించారు. కుటుంబ సభ్యులతో గొడవే ఇందుకు కారణమని తెలిసింది.

## నేడు రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు

అనంతపురం టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు సదస్సు నిర్వహించనున్నట్లు పార్టీ నగర కార్యదర్శి రామిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4.30 గంటలకు ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి లలితకళా పరిషత్ వరకు కవాతు నిర్వహించి, సదస్సు నిర్వహిస్తామన్నారు. సదస్సుకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, సీనియర్ నాయకుడు ఓబులు, జిల్లా కార్యదర్శి నల్లప్ప హాజరవుతారని పేర్కొన్నారు.

## పనులు మావి.. ఫోజులు మీవా..?

### ఎమ్మెల్యేపై మేయర్ వసీం ధ్వజం



మాట్లాడుతున్న నగర మేయర్ మహ్మద్ వసీం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు మీరు ఫోజులు ఇవ్వడం ఏమిటని నగర మేయర్ మహ్మద్ వసీం అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌పై ధ్వజమెత్తారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నగర అభివృద్ధికి ఒక్క రూపాయి నిధులు తీసుకురాని అసమర్థులని, వైసీపీ పాలకవర్గం నిధులతో చేపట్టిన పనులకు భూమిపూజ పేరుతో ఫొటోలకు ఫోజులివ్వడం ఏమిటని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదని తమ పాలకవర్గంపై బురదజల్లడం మంచిదికాదని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నాటి సీఎం జగన్, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కృషితో నగరంలో రూ.1045కోట్లతో చేసిన పనులు కంటికి కనపడవా అని నిలదీశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, ఇషాక్, కమల్‌భూషణ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్‌ఏ కుటుంబానికి ఆర్థిక సాయం



వీఆర్‌ఏ కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న తహసీల్దార్ వీరమ్మ

గార్లదిన్నె, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం నుంచి పడి ఎరగుంట్ల వీఆర్‌ఏ వెంకటరాముడు మృతి చెందిన విషయం విదితమే. మంగళవారం ఆయన కుటుంబానికి ప్రభుత్వం నుంచి మట్టి ఖర్చులకు రూ.25వేలు, వీఆర్‌ఏలు రూ.10,500 ఆర్థిక సాయం చేశారు. ఆ నగదును తహసీల్దార్ వీరమ్మ, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున తదితరులు వీఆర్‌ఏ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ హేమ, వీఆర్వో రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

అనంతపురం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ మాసారంభాన్ని పురస్కరించుకుని.. అరవిందనగర్‌లోని సీఎస్ఐ హోలీ ట్రినిటి చర్చిలో మంగళవారం సాయంత్రం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రా థియాలజికల్ కాలేజి ప్రిన్సిపాల్ సునియేల్ వరప్రసాద్ హాజరై దైవసందేశం ఇచ్చారు. అనంతరం చిన్నారులు క్రీస్తు భక్తిగీతాలకు నృత్యాలు, నాటక ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రెవరెండ్ సౌజన్య, లూసీ, చర్చి కార్యదర్శి జాన్ చంద్రశేఖర్, ఇమాన్యుయేల్, సండే స్కూల్ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.




సందేశమిస్తున్న ఆంధ్రా థియాలజికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రెవరెండ్ సునియేల్ వరప్రసాద్

## ఫ్రిడ్జ్, గడ్డం.. వైరస్‌కు నిలయాలు

### వైద్యవిద్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శంకర్




వైరస్ నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

అనంతపురం వైద్యం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాలు నిల్వచేసుకునే ఎలక్ట్రానిక్ ఫ్రిడ్జ్.. పెరిగిన గడ్డం వైరస్‌కు నిలయాలని ప్రభుత్వ వైద్యవిద్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, ఫోరెన్సిక్ హెచ్ఓడీ ప్రొఫెసర్ శంకర్ పేర్కొన్నారు. మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన యాంటీ మైక్రోబెల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శంకర్ మాట్లాడుతూ.. ఫ్రిడ్జ్‌లోని ఆహారం తీసుకోవడంతో పొట్టలోకి, పెరిగిన గడ్డంతో ముక్కు, నోటిద్వారా మెదడకు వైరస్ వెళ్లి అనారోగ్యానికి గురిచేస్తోందని తెలిపారు. డాక్టర్ సలహా లేనిదే యాంటిబయాటిక్స్‌ను వినియోగించరాదని అన్నారు. హెపటైటిస్-బి వైరస్, టీటీ లాంటి టీకాలు వేయించుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం వంటి జాగ్రత్తలతో శరీరంలో వైరస్ వెళ్లకుండా నిలువరించవచ్చని వివరించారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ డిపార్ట్‌మెంట్ టీచింగ్ స్టాఫ్, టెక్నీషియన్స్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి వైద్యానికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న విద్యుత్ శాఖ ఏఈ రవిశంకర్

గార్లదిన్నె, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఓ విద్యార్థి వైద్యం ఖర్చులకు విద్యుత్ శాఖ ఏఈ రవిశంకర్ రూ. 10వేలు ఆర్థిక సాయం చేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. మండల పరిధిలోని కేశవాపురం గ్రామానికి చెందిన సచివాలయం ఉద్యోగి బి. ఆంజనేయులు కుమార్తె అక్షయగ్రేస్ ఏడో తరగతి చదువుతోంది. ఆ విద్యార్థి గత కొంతకాలం నుంచి అరుదైన వ్యాధితో బాధపడుతోంది. దీంతో సుమారు రూ.20 లక్షలు వరకు అప్పులు చేసి వైద్యం చేయించారు. వ్యాధి పూర్తిగా నయం చేసేందుకు సుమారు రూ. 30 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. దీంతో ఆర్థిక స్థోమత లేక విద్యార్థి తల్లిదండ్రులు తమ బిడ్డకు అపరేషన్‌కు దాతలు సహాయం చేయాలని అపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. విషయం తెలుసుకున్న అనంతపురం విద్యుత్ శాఖ ఏఈ రవిశంకర్ మంగళవారం స్థానిక తహసీల్దార్ బండారు ఈరమ్మ సమక్షంలో వైద్య ఖర్చులకు తల్లిదండ్రులకు రూ. 10వేలు ఆర్థిక సాయం అందచేశారు.

## భవిత కేంద్రాలను నిత్యం పర్యవేక్షించాలి



ఎంఈఓలతో సమగ్రశిక్ష ఏపీసీ శైలజ, సెక్టోరల్స్

అనంతపురం విద్య, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల పిల్లల కోసం నిర్వహిస్తున్న భవిత కేంద్రాలను ఎంఈఓలు నిత్యం పర్యవేక్షించాలని సమగ్రశిక్ష ఏపీసీ శైలజ సూచించారు. మంగళవారం కొర్రపాడు వద్ద గల ట్రైనింగ్ సెంటర్‌లో ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీసీ మాట్లాడుతూ.. భవిత కేంద్రాలు ప్రత్యేక అవసరాల పిల్లలకు వరం అన్నారు. ప్రభుత్వం అనేక రకాలుగా వైద్యసేవలు అందిస్తూనే ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఈ భవిత సెంటర్ల ద్వారా అందే సేవలను ప్రజలకు తెలియజేసి సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో సెక్టోరల్స్ వేణుగోపాల్, కవిత, రామచంద్ర, చంద్రశేఖర్, ఫణిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం

గార్లదిన్నె, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటంక గ్రామ సమీపంలో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఏడాది సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి సందర్భంగా స్వామికి, శ్రీవల్లి దేవసేనలకు కల్యాణోత్సవం నిర్వహిస్తామని వివరించారు.

## హంద్రీనీవా కాలువలో పడి గొర్రెల కాపరి మృతి



రామాంజనేయులు మృతదేహం

ఆత్మకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వై.కొత్తపల్లి వద్ద సోమవారం హంద్రీనీవా కాలువలో కాలుజారి పడిన గొర్రెలు కాపరి రామాంజనేయులు (45) మృతదేహం మంగళవారం బయట పడింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రెండురోజులుగా గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటికి తీశారు. ఇతడికి భార్య కూతురు వున్నారు. గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగించేవాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శింగనమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బేస్, ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 27 నుంచి నంద్యాల జిల్లా అహోబిలం నందు జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ బేస్‌బాల్ అండర్-17 బాలురు విభాగంలో పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు బి.రాఘవేంద్ర, జి.సంతోష్ ఎంపికయ్యారు. అలాగే ఈనెల 27 నుంచి 30 వరకు పల్నాడు జిల్లా నరసారావుపేట నందు జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ అండర్-17 బాలురు విభాగంలో 9వతరగతి చదువుతున్న ఎం.ధనుష్ ఎంపికయ్యాడు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు హరినాథ్, పీడీ నరసింహారెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ వరదరాజులు, ఉపాధ్యాయులు అభినందించారు.

# రథానికి మోక్షమెన్నడో..?

● పెన్నహోబిలంలో రెండేళ్లయినా కొలిక్కిరాని పనులు ● రానున్న బ్రహోత్సవాలకు పూర్తయ్యేది గగనమే


లక్ష్మీనరసింహస్వామి ఆలయం



రథం తయారీకి వాడిన కలప

ఉరవకొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్న హోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన రథం తయారీ పనులకు రెండేళ్లయినా ఓ కొలిక్కి రాలేదు. ఈ పనులు ఆగిపోయి ఏడాది అయ్యింది. రానున్న బ్రహోత్సవాల నాటికి కూడా పూర్తి అయ్యేది అనుమానమే. మూడేళ్ల క్రితం బ్రహోత్సవాల సమయంలో పాత రథానికి మరమ్మతులు చేస్తున్న సమయంలో రథం కూలి ధ్వంసమైన విషయం తెల్సిందే. బ్రహ్మోత్సవాలకు పాత రథానికే మరమ్మతులు చేయించి ఉత్సవాలు పూర్తి చేశారు. 2024 ఫిబ్రవరిలో నూతన రథం తయారీకి టెండర్లు పిలువగా.. రూ.1.78 కోట్లకు అనంతపురానికి చెందిన ఓ వ్యక్తి దక్కించుకున్నారు. అయితే టెండర్ల సమయంలో అవకతవకలు జరిగాయన్న విమర్శలు రావడంతో.. కాంట్రాక్టరుతో సబ్‌లీజ్‌కు తీసుకున్న వారు ఆ పనులు ఆపేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన బదిలీల్లో అధికారులు మారారు. రథం తయారీకి ఉపయోగించే సామగ్రి నాణ్యత లేదనే విమర్శలు వచ్చాయి. రథం తయారీ పనులు పరిశీలించి.. నమూనాను తయారు చేసిన తర్వాతే పనులు ప్రారంభించాలని దేవదాయ శాఖ అధికారులు తేల్చిచెప్పారు. దీంతో రథం తయారీ పనులు పూర్తిగా ఆగిపోయాయి. ఈఓ కూడా సెలవులో వెళ్లడంతో జిల్లా దేవదాయ శాఖాధికారి తిరుమల రెడ్డికి ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించారు. ఆయన కూడా సెలవులో వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జీ ఈఓను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ పనిచేయలేదు.

## క్లుప్తంగా ..

### సచివాలయ సిబ్బందికి షోకాజ్

కళ్యాణదుర్గం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలం గొల్లపల్లి గ్రామ సచివాలయంలోని ఎనిమిది మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీఓ సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలైనా సచివాలయ సిబ్బంది విధులకు రాలేదని, దీంతో మూడు రోజుల లోపల సచివాలయ సిబ్బంది సంజాయిషీని లిఖితపూర్వకంగా మండల పరిషత్ కార్యాలయానికి ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు.

### ఆలయాలకు నిధులివ్వండి

పామిడి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్నానది ఒడ్డున వెలసిన భోగేశ్వరస్వామి, లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఆ ఆలయాల కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అనంతపురంలోని ఎంపీ స్వగృహంలో మంగళవారం ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఇందులో ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ప్రెసిడెంట్ బొల్లు శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జింకల సంజీవకుమార్, అర్చకులు రామేశ్వరశర్మ, నాగపురుషోత్తం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం


మాట్లాడుతున్న పరమేశ్వరనాయక్

కళ్యాణదుర్గం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఐసీసీ అబ్జర్వర్ పీటీ పరమేశ్వరనాయక్ సూచించారు. స్థానిక షాదిమహల్లో మంగళవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కాంగ్రెస్ కమిటీలతో పాటు బ్లాక్, మండల్, గ్రామ కాంగ్రెస్ కమిటీలను పునరుద్ధరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీసీసీ అబ్జర్వర్లు అంబటి రామకృష్ణ యాదవ్, అలీఖాన్, డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంభూపాల్‌రెడ్డి, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనం తనిఖీ

అనంతపురం విద్య, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై నిరంతరం నిఘా ఉంటుందని ఆ విభాగం పర్యవేక్షకుడు, విద్యాశాఖ ఏడీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం మండలాల్లోని వివిధ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లలకు భోజనం వడ్డించారు. భోజనం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.

### న్యాయవిజ్ఞాన సదస్సు

ఉరవకొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సును ఉరవకొండ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ దుర్గాకల్యాణి మంగళవారం నిర్వహించారు. మహిళల చట్టాలపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం శివయ్య, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

● గుత్తి: స్థానిక కేజీబీవీ కళాశాలలో మంగళవారం న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా హింసా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ బీ శ్వేత, ఎస్‌ఐ సురేష్, ప్యానల్ న్యాయవాది గంగాధర్ కుమార్ పాల్గొన్నారు.

● కళ్యాణదుర్గం : అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక కేజీబీవీ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ జాగృతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో జూనియర్ సివిల్ న్యాయాధికారి భాను కేజీబీవీ ప్రిన్సిపాల్ నాగజ్యోతి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పార్థసారథి చౌదరి పాల్గొన్నారు.

### జాబ్ కార్డులు ఇవ్వండి

పామిడి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూతన హౌసింగ్ లబ్ధిదారులకు ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు వెంటనే మంజూరు చేయాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ తేజోత్స్న, ఏపీఓ ఆదినారాయణమ్మను మంగళవారం విజ్ఞప్తి చేశారు. త్వరలోనే జాబుకార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

### కబ్జాస్థలం పరిశీలన

పామిడి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిరుపేదల ఇళ్ల స్థలాలకు నకిలీ పట్టాలు సృష్టించి.. విక్రయిస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి మంగళవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఆర్‌ఐ గాయత్రి, వీఆర్వో గోపాల్‌రెడ్డి స్థానిక వీకే ఆదినారాయణరెడ్డి కాలనీలో కబ్జా చేసిన స్థలాన్ని, నకిలీ పట్టాను పరిశీలించారు. విచారణకు తహసీల్దార్ కార్యాలయానికి రావాలని సూచించారు.

### డిప్యూటీ ఎంపీడీఓగా రమణ

బొమ్మనహళ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీఓ రమణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గత డిప్యూటీ ఎంపీడీఓ దేవదాస్ ఉద్యోగోన్నతిపై ఎంపీడీఓగా గుంతకల్లు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డీ. హీరేహళ్ గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి రమణను ఉద్యోగున్నతిపై డిప్యూటీ ఎంపీడీఓగా నియమించారు.

## ముగిసిన ఉరుసు


ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్థులు

విడపనకల్లు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉండబండలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న నాగూరు దాదావలి ఉరుసు ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం తెల్లవారు జామున వరకూ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారు జామును మూడు గంటల నుంచి స్వామి వారి షంషేర్‌ను గుర్రంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. షంషేర్ దర్గాను చేరుకోవటంతో ఈ ఉత్సవాలు ముగిశాయి.

## వైభవంగా శత రుద్రాభిషేకం


అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ఉరవకొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్టి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి పాలతో శత రుద్రాభిషేకాన్ని మంగళవారం నిర్వహించారు. సాయంత్రం నాగమండల ఆరాధన, కుంకుమార్చనలు చేశారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

## చింతలరాయుడికి తిరుమంజన సేవ



తాడిపత్రి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన శ్రీ చింతల వెంకటరమణస్వామి పవిత్రోత్సవాల సందర్భంగా మంగళవారం స్వామివారికి తిరుమంజనసేవ నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత చింతలరాయుని ఉత్సవమూర్తులకు తిరుమంజనసేవ నిర్వహించారు.

## మాళెమారెమ్మదేవికి పూజలు


ఆలయం వద్ద భక్తుల సందడి

కణేకల్లు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెంపల్లిలో శ్రీమాళెమారెమ్మదేవి అమ్మవారికి మంగళవారం వైభవంగా పూజలు నిర్వహించారు. అమ్మవారిని గంగజలంతో అభిషేకించి.. ఆకుపూజ, ఒడిబియ్యం పెట్టి.. పూజలు నిర్వహించి బలి మహామంగళారతి ఇచ్చారు. ఏటా ఈ మాసంలో పంటలు కోతలకు ముందు తామీ ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని స్థానిక టీడీపీ సీనియర్ నాయకుడు నంగి చిన్న ఈరప్ప తెలిపారు. ఇందులో టీడీపీ మాజీ కన్వీనర్ లాలెప్ప, నాయకులు నంగి వంద్రప్ప, పూజారి తిప్పేస్వామి పాల్గొన్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం


అంబాభవాని

పామిడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీలోని అంబాభవాని ఆయన 24వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, లలిత సహ స్ర నామావళి, కుంకుమ అర్చన చేశారు. మహిళా భక్తులు ప్రాకారోత్సవం నిర్వహించారు. ఇందు లో అంబా భవాని సేవాదళ్ అధ్యక్షుడు ముకుందరావు, భావసార క్షత్రియ సమాజ్ సభ్యులు, భవాని మాలదారులు, భక్తులు పాల్గొన్నారు.

### గాలి మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ



రాయదుర్గం రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెంచానపల్లిలో నూతనం గా నిర్మించిన ఆలయంలో గాలి మారెమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పొట్ల రవికుమార్, సిద్ధప్ప, రమేష్‌బాబు, ఎర్రిస్వామి, మురళి, ఆంజనేయులు, జయరాములు పాల్గొన్నారు.

### ఇన్‌ఫ్లో 2,680 క్యూసెక్కులు

బెళుగుప్ప, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 2,680, ఔట్ ఫ్లో 2,680 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు మంగళవారం తెలిపారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.743 టీఎంసీల నీరు ఉందని, ఇక్కడి నుంచి ఫేజ్-2కు 1,317 క్యూసెక్కుల నీరు వెళ్తోందని వెల్లడించారు.

## గ్రామదట్లలో 'రైతన్నా.. మీ కోసం'


కరపత్రాలతో నాయకులు, అధికారులు

రాయదుర్గం రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామదట్లలో టీడీపీ మండల కన్వీనర్ కురుబ హనుమంతు ఆధ్వర్యంలో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రైతులకు కరపత్రాలను పంపిణీ చేశారు. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే లాభసాటి వ్యవసాయం దృష్టి సారించాలని హనుమంతు సూచించారు. ఇందులో సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, ఉపసర్పంచ్ రమేష్, సర్పంచులు ఆవులదట్ల వన్నూరుస్వామి, జుంజురంపల్లి వన్నూరుస్వామి, బీఎల్‌ఏలు సురేష్, సోమేష్, కిరణ్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు వైష్ణవి


వైష్ణవి, ఆమె తల్లి చిట్టెమ్మకు సన్మానం

వజ్రకరూరు(ఉరవకొండ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూల్‌లో అండర్-19 బాలికల విభాగంలో ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి రగ్బీ పోటీల్లో వజ్రకరూరు మండలం చిన్నహోతూరు జడ్పీ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి వైష్ణవి ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. దీంతో వైష్ణవి, ఆమె తల్లి చిట్టెమ్మను మంగళవారం ఆ పాఠశాలలో సన్మానించారు. ఇందులో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, పీడీ ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యశస్వినికి కలెక్టర్ అభినందన


విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్

తాడిపత్రి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన తైక్వాండో విద్యార్థిని యశస్విని 6.9 సెకన్లలో తలతో వరుసగా 100 ట్యూబ్‌లైట్లు విరగొట్టి ప్రపంచ రికార్డు నెలకొల్పిన విషయం తెల్సిందే. యశస్విని, ఆమె తల్లిదండ్రులు పద్మజ, రంగనాథ్, తైక్వాండో మాస్టర్ సాయి, విశ్రాంత పీడీ శివయ్య మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను కలిశారు. యశస్వినిని కలెక్టర్ అభినందించారు.

## ఐక్యత కోసం పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న విద్యార్థులు, పుర ప్రముఖులు

గుంతకల్లుటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లబాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా యూనిటీ మార్చ్ (ఐక్యత కోసం పాదయాత్ర) కార్యక్రమాన్ని పట్టణంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా దేశ ఐక్యత సాంస్కృతిక సాంప్రదాయాలను గుర్తు చేస్తూ విద్యార్థినులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పాదయాత్రను టీడీపీ ఇన్చార్జి గుమ్మనూరు నారాయణ స్వామి ప్రారంభించారు. ఇందులో ఆ నలుగురు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్, శ్రీ శంకరానంద గిరిస్వామి డిగ్రీ కళాశాల, ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్యాడెట్లు, విద్యార్థులు, నారాయణ జూనియన్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

### పీఏబీఆర్ గేట్ల పరిశీలన

కూడేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ డ్యాం కుడికాలువ గేట్లను ఇరిగేషన్ ఎస్‌ఈ సుధాకర్‌రావు మంగళవారం పరిశీలించారు. మరమ్మతులు చేయడానికి సంబంధిత మెకానిక్‌లతో చర్చించారు. గేట్లకు సంబంధించిన సామగ్రి తీసుకొని వచ్చిన తర్వాత మరమ్మతులు చేసి నీటిని విడుదల చేస్తామని డీఈ కవిత తెలిపారు.

## రంగయ్యా... ప్రమాణానికి సిద్ధమా..?

టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు సవాల్


మాట్లాడుతున్న పాలబండ్ల శ్రీరాములు

బ్రహ్మసముద్రం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): 'మాజీ ఎంపీ రంగయ్య .. మీ హయాంలో కళ్యాణదుర్గం నియోజకవర్గం అభివృద్ధిని గాలికి వదిలేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారు. అందుకోసం తన సొంత డబ్బులను కూడా విరివిగా ఖర్చు చేస్తున్నారు. ఆ అభివృద్ధిని చూసి ఓర్వలేక.. గ్రూపు-1 అధికారిగా పనిచేసిన నీవు .. హుందాతనాన్ని వీడి.. లేనిపోని విమర్శలు చేస్తున్నారు. ఇసుక, మట్టి అమ్ము కొంటున్నారని ఆరోపణలు చేస్తున్నారు. ఎవరు ఇసుక, మట్టి అమ్ముకున్నారో.. వేపులపర్తి రంగనాథస్వామి ఆలయం వద్ద ప్రమాణం చేయడానికి మేం సిద్ధం.. మీరు సిద్ధమా..?' అని టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు బహిరంగ సవాల్ విసిరారు. మంగళవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేగా ఉష్శశ్రీచరణ్, ఎంపీగా రంగయ్య ఉన్నప్పటికీ ఇద్దరి మధ్య సఖ్యత లేక నియోజకవర్గం గురించి ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు నీళ్లు రావని రంగయ్య వ్యంగ్యంగా మాట్లాడారని, కానీ ఎమ్మెల్యే అమిలినేని ప్రత్యేక చొరవతో కాలువ పనులు చేయించారని, మరో నాలుగు రోజుల్లో చెరువు నిండి మరువ పారనుందని తెలిపారు. ఇప్పటికైనా రంగయ్య ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఇందులో బీఎస్‌ఎన్‌ఎల్ అడ్వయిజరీ కమిటీ మెంబర్ అమరా రామ్మోహన్ చౌదరి, జెడ్పీటీసీ పద్మావతి, మాజీ జెడ్పీటీసీ వెంకటేశులు, రాష్ట్ర తెలుగు రైతు సంఘం కార్యదర్శి కురుగౌడ, సింగిల్ విండో ప్రెసిడెంట్ అంకె ఓబుళేసు, ప్రధాన కార్యదర్శి తలారి భీమప్ప, మాజీ వైస్ ఎంపీపీ చిత్తప్ప, క్లస్టర్-2 ఇన్‌చార్జ్ నాగరాజు, భైరవానితిప్ప మాజీ సర్పంచ్ రామచంద్రప్ప పాల్గొన్నారు.

## దాడి చేశారని ఫిర్యాదు

గుంతకల్లు టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలాంపల్లి గ్రామంలో ఓ కుటుంబానికి చెందిన వారిపై మరో కుటుంబ సభ్యులు మంగళవారం దాడి చేశారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చింతలాంపల్లిలో ఓ యువకుడు అదే గ్రామానికి చెందిన యువతిని ఆదివారం వివాహం చేసుకున్నాడు. ఇద్దరు వెళ్లి రూరల్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో అబ్బాయి, అమ్మాయి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు రావాలని పోలీసులు కోరారు. అమ్మాయి తల్లిదండ్రులు తమకు అమ్మాయి ఇక లేదని తేల్చిచెప్పారు. దీంతో అబ్బాయి తల్లిదండ్రులు ఆ అమ్మాయిని ఇంటికి తీసుకెళ్లారన్నారు. మంగళవారం అమ్మాయి కుటుంబ సభ్యులు.. తమపై దాడి చేశారని, ఇంట్లో వస్తువులు ధ్వంసం చేశారని అబ్బాయి కుటుంబ సభ్యులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## 'మన డబ్బులు..' పై అవగాహన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయం వద్ద 'మన డబ్బులు-మన లెక్కలు' యాప్‌పై ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సెల్ ఫోన్‌లో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే పొదుపు సంఘాల సభ్యుల తమ ఖాతా, రుణ, చెల్లింపుల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, డీఆర్‌డీఏ డీపీఎం రవీంద్రబాబు, ఏపీఎం గుణ శ్యాం, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బీఎస్ కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప, రామన్న చౌదరి, ఫజులు, పాల మల్లికార్జున, హనుమంతు పాల్గొన్నారు.

● రైతన్నా.. మీ కోసం..: గుంతకల్లు మండలంలోని గొల్లలదొడ్డిలో రైతన్నా.. మీ కోసం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు రమాదేవి, ఎంపీడీఓ నాగభూషణం, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి పాల్గొన్నారు.

### టీడీపీ నాయకుడి మృతి

రాయదుర్గంరూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మెచ్చిరి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పెద్దగౌని హనుమంతరెడ్డి(55) మంగళవారం అనారోగ్యంతో మరణించాడు. ఆయన మృతదేహానికి టీడీపీ మండల కన్వీనర్ కురుబ హనుమంతు, సర్పంచులు వన్నూరుస్వామి నివాళులర్పించారు.

## క్రైం న్యూస్..

### మహిళ ఆత్మహత్య


అనిత (ఫైల్)

పెద్దపప్పూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకోట గ్రామానికి చెందిన శ్రీరాములు భార్య అనిత (30) మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. వీరికి పది సంవత్సరాల క్రితం వివాహమైంది. గత కొంతకాలంగా వారి మధ్య మనస్పర్థలు రావడంతో వారు గొడవపడేవారు. మంగళవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న అనిత.. ఫ్యాన్‌కు ఉరేసుకొని.. ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

### పాముకాటుతో రైతు మృతి


ప్రతాప్ (ఫైల్)

పుట్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట గ్రామ రైతు ప్రతాప్ (30) పాము కాటుతో మరణించాడు. మంగళవారం గ్రామశివారులో ఉన్న పత్తిపంటకు అతను నీళ్లు పెడుతుండగా.. పాము కాటేసింది. వెంటనే తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే అతను మరణించినట్లు నిర్ధారించారు. ప్రతాప్‌కు భార్య శరణ్య, ఐదునెలల కుమార్తె ఉన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

ఉరవకొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం బోడిసానిపల్లి సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డ వజ్రకరూరుకు చెందిన రామకృష్ణ (45) మరణించాడు. అతను అనంతపురం వెళ్లి.. తిరిగి బైక్‌పై సోమవారం రాత్రి వస్తుండగా.. జింకల గుంపు అడ్డువచ్చింది. వాటిని తప్పించబోయి.. అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. 108వాహనంలో అనంతపురానికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. కేసు దర్యాప్తులో ఉంది.

### గుర్తు తెలియని వ్యక్తి...

గుంతకల్లు టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ వద్ద శ్రీనివాసులు (50) అనే వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో సోమవారం బాధపడుతుండగా 108 అంబులెన్సులో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వన్‌టౌన్ పోలీసులు మంగళవారం తెలిపారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించినట్లు వారు తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

### లైన్‌మన్ ఆత్మహత్యాయత్నం

ఉరవకొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో పని చేస్తున్న ఓ లైన్‌మెన్ మంగళవారం ఉదయం కార్యాలయం ఆవరణంలోని విష ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కరెంట్ బిల్లుల విషయంలో టార్గెట్ చేరకపోవడంతో మనస్థాపానికి గురై అతను ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం. అతని పరిస్థితి నిలకడగా ఉంది.

### రైతుకు గాయాలు

గుత్తిరూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంగన్నపల్లిలో విద్యుదాఘాతంతో రైతు వెంకట్రరామయ్య మంగళవారం గాయపడ్డాడు. తోటలో మోటార్ ఆన్ చేస్తుండగా.. విద్యుత్ షాక్ కొట్టింది. స్థానికులు అతన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి...

కూడేరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : అనంతపురం రూరల్ మండలం పిల్లిగుండ్ల కాలనీకి చెందిన కిశోర్, లిఖిత, రసజ్ఞ బైక్‌లో ఉరవకొండ వెళ్తుండగా... చోళసముద్రం గ్రామానికి చెందిన శంకర్ మరో బైక్‌లో వస్తూ.. కూడేరులో ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో కిశోర్, శంకర్‌కు తీవ్ర గాయాలు కాగా, లిఖిత, రసజ్ఞకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### రైతు ఇంట్లో చోరీ

బెళుగుప్ప, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యలగలవంక తండాలో సోమవారం రాత్రి రైతు గోపాల్ నాయక్ ఇంట్లో చోరీ జరిగింది. బీరువా పగులగొట్టి రూ. లక్ష నగదు, 15 తులాల వెండి ఆభరణాలను దుండగులు ఎత్తుకెళ్లారు. మొక్కజొన్న పంట అమ్మగా వచ్చిన రూ. లక్ష బీరువాలో ఉంచిన గోపాల్‌నాయక్.. కుటుంబ సభ్యులతో కలిసి గొర్రెలకు కాపలాగా దొడ్లో నిద్రపోగా.. ఈ చోరీ జరిగింది. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### జూదరుల అరెస్ట్

తాడిపత్రి నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని హుస్సేనాపురం గ్రామం సమీపంలో తోటలో పేకాట ఆడుతున్న 16 మందిని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, పట్టణ సీఐ ఆరోహణరావు తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.89020 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

### మట్కా బీటర్లు...

పుట్లూరు: మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో మట్కా రాస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ.15వేలు స్వాధీనం చేసుకొని.. కేసు నమోదు చేశారు.

● యాడికి : యాడికిలో మట్కారాస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్‌చేసి.. అతని వద్ద నుంచి రూ.8100 నగదు,మట్కాచిట్టీలను స్వాధీనం చేసుకున్నామని సీఐ ఈరన్న తెలిపారు.